ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 31.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 11 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

వైభవ్ సిక్సర్ల మోత 10

కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు

ఆయన లేకపోతే నేను చేసిన మంచి ప్రజలకు తెలిసేది కాదు

- నియోజకవర్గ పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారు
- రాష్ట్రపతి పాలన పెడ్తారంట.. మరీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా?
- దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి
- రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలి
- మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి ఇష్టాగోష్టి

...:: 2లో

కల్తీరాయుళ్లపై ఉక్కుపాదం

ఆహార వస్తువుల కల్తీపై ప్రత్యేక విభాగం నిఘా

- ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తాం
- దేశంలో రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం
- పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్న సీఎం
- అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 30: ఆహార కల్తీని నియంత్రించడానికి రాష్ట్రంలో ఒక ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చిన ఈగల్, హైడ్రా తరహాలోనే ఆహార కల్తీని నియంత్రించడానికి కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం దేశంలో ప్రస్తుతం అమలవుతున్న కల్తీ నిరోధక చట్టాలను అధ్యయనం చేసి పటిష్టమైన చర్యలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రితో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి

...:: మిగతా 2లో

రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరిగింది

స్కిల్స్ కలిగిన యువత హైదరాబాదులో ఉన్నారు

అందుకే విదేశీ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి

- ముందుచూపు ప్రణాళిక ఉన్నందునే క్యూర్, ఫ్యూర్, రేర్ విధానం
- జీడీపీని పెంచుకోవడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నాం
- మండలిలో ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడిన రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 30: ప్రజా ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం శాసనమండలిలో ఆయన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవృద్ధి రేటు ఎనిమిది శాతం ఉండగా తెలంగాణ రాష్ట్రం వృద్ధిరేటు 10.7% ఉందని అన్నారు. 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయడానికి పక్కా ప్రణాళికతో ఈ ప్రభుత్వం ముందుకెళుతున్నదని తెలిపారు. 8 శాతం వృద్ధిరేటు ఉన్న దేశానికి సాధ్యమైతే 10.7% వృద్ధి రేటు ఉన్న తెలంగాణ రాష్ట్రం పెట్టుకున్న లక్ష్యానికి చేరుకోవడం ఎందుకు సాధ్యం కాదని, తెలంగాణ రాష్ట్రంలో వృద్ధిరేటు పెరగడానికి కావలసిన మానవరులు వ్యవస్థలు ఉన్నాయి. వాటిని 100కు 100%

...:: మిగతా 2లో

నక్సలిజం దాదాపు అంతమైంది

ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోంశాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు.

9

హిందూ మతాన్ని మోడీ పట్టించుకోరు

కేరళలో ఏప్రిల్ 9వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం పాతానమిట్టలో జరిగిన సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు.

9

మండలికి నితీశ్ రాజీనామా

బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు.

9

నేవీ చీఫ్ మృతిని ధ్రువీకరించిన ఇరాన్

అమెరికా-ఇజ్రాయెల్ దళాలు చేపట్టిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగిన విషయం తెలిసిందే. దాడుల్లో సుమారు 6008 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

9

ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకే

‘హేట్ స్పీచ్’ బిల్లు

- విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలు
- భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు
- అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా శిక్షలు ఉన్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక క్రూరమైన ఆయుధంగా ఆయన

...:: మిగతా 2లో

‘జీవో 317’ బాధితులకు న్యాయం చేయండి

- వన్ టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు బదిలీ చేయండి
- స్థానికతను నిర్ధారించే ఉత్తర్వుల్లో మార్పులు చేయండి
- సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత లేఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 30 : జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాలు, జోన్ లలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాలు, జోన్ లలో పోస్టింగ్స్ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగుల సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న

...:: మిగతా 2లో

పేదల కడుపు నింపడమే లక్ష్యం

- సన్నబియ్యం పథకం సీఎం రేవంత్‌రెడ్డి అలోచనే
- ఏటా రూ.14,500కోట్లు వ్యయం
- మీడియా ఇష్టాగోష్టిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 30: తెలంగాణ ప్రభుత్వం పేదల ఆహార భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సన్నబియ్యం పంపిణీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనే ఉందని, దాని పూర్తి క్రెడిట్ కూడా ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. సోమవారం శాసనసభ ఆవరణలో మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది సుమారు రూ.14,560కోట్ల భారీ వ్యయంతో సన్నబియ్యం

...:: మిగతా 2లో

హార్ముజ్‌ను తెరుస్తారా.. ఖర్గ్‌ను పేల్చేయాలా?

- ఇరాన్‌కు చెందిన కీలక మౌలిక సదుపాయాలపై భారీ దాడులు
- విద్యుతుద్పాదన కేంద్రాలు, చమురు బావులు, ఖర్గ్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు
- పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు.. : ఇరాన్
- ఇరాన్‌పై అణ్వాయుధాల ప్రయోగానికి ప్రయత్నాలు
- ఐక్యరాజ్యసమితిపై దౌత్యవేత్త సంచలన ఆరోపణలు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

హార్ముజ్ జలసంధి తెరుచుకోకపోతే ఇరాన్‌కు చెందిన కీలక మౌలిక సదుపాయాలపై అమెరికా భారీ దాడులు జరుపుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌లో హేతుబద్ధమైన పాలనతో జరుపుతున్న చర్చల్లో గొప్ప పురోగతి ఉందని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని తన ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. అయితే శీఘ్రగతిన ఒప్పందం కుదిరి వెంటనే వ్యూహాత్మక జలసంధి వాణిజ్య కార్యకలాపాల కోసం తెరుచుకోకపోతే ఇరాన్‌కు చెందిన విద్యుతుద్పాదన కేంద్రాలు, చమురు బావులు, ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా పూర్తిగా ధ్వంసం చేస్తుందని ఆయన హెచ్చరించారు. స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకోవచ్చని, అయితే ఈ సౌకర్యాల జోలికి ఉద్దేశపూర్వకంగా ఇంకా పోలేదని ట్రంప్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ 47 ఏండ్ల భయానక పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగా ఈ చర్య ఉంటుందని ట్రంప్ తెలిపారు. కాగా, ఇరాన్‌కు చెందిన మౌలిక వసతులపై దాడులకు

...:: మిగతా 2లో

పాతాళంలోకి రూపాయి

- క్షీణిస్తున్న రూపాయి మారకం
- ఇంట్రాడేలో 95కు పడిపోయిన విలువ
- చివర్లో 15 పైసలు పెరిగి 94.70 వద్ద ముగింపు
- ఈ ఏడాది10 శాతం వరకు నష్టపోయిన రూపాయి
- గడిచిన 14 ఏండ్లలో ఇదే అతిపెద్ద పతనం
- పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే కారణం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 30: రూపాయి పాతాళంలోకి పడిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తలు మొదలైనప్పటి నుంచి వేగంగా క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ సోమవారం భారీగా పతనం చెందింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 95 మార్క్‌ను అధిగమించింది. ఇంట్రాడేలో 95.22 కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ ఈ పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వుబ్యాంక్‌రంగంలోకి దిగడంతో చివర్లో 15 పైసలు ఎగబాకి 94.70 వద్ద ముగిసింది. 165 పైసల శ్రేణిలో కదలాడిన డాలర్‌రూపీ ఎక్స్చేంజ్ రేటు వరుసగా 31 రోజులుగా పతనం చెందుతూనే ఉన్నది. రిజర్వుబ్యాంక్ ప్రతీరోజూ ట్రేడింగ్ ముగింపు నాటికి ఆన్‌షోర్ మార్కెట్లో బ్యాంకులు 100 మిలియన్ డాలర్ల

...:: మిగతా 2లో

కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌వల్లే తనకు గుర్తింపు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. 'రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసింది' అని చెప్పుకొచ్చారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి నిర్వహించిన ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై మాట్లాడారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని, ఆయనను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాష్ట్రపతి పెట్టరా?

దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని, తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని సీఎం మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందని మరో మారు రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా, ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాజకీయంగా అవసరం ఉన్నప్పుడే సౌత్ ఇండియాను పట్టించుకోవడం లేదని, ఇక నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు.

దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు

ఇది పార్టీల సమస్య కాదని, సౌత్ ఇండియా, ప్రజా సమస్యని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని, సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని అన్నారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని, అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ త్వరలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని భరోసా సీఎం కల్పించారు.

నాకు కేసీఆర్‌కు పోలిక లేదు

తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని, ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి, చేసిన దానికి సంబంధం లేదని, ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని సీఎం ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500 గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని, 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

కల్తీరాయుళ్లపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మీడియాతో ముచ్చటిస్తూ.. 'రేషన్ షాపుల ద్వారా దొడ్డుబియ్యం అందించినా తినేవారు లేకపోవడంతో ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయింది. పైగా దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్ప పేదలకు ఉపయోగపడటం లేదు. అన్ని రకాలుగా ఆలోచనలు చేసిన తర్వాత పేదలు తినగలిగే సన్నబియ్యం అందించాలని ఈ పథకాన్ని ప్రారంభించాం.' అని అన్నారు. ఇందుకోసమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించి సన్నవడ్లు పండించాలని రైతులను ప్రోత్సహించామని అన్నారు. 'అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు జారీ చేశాం. ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ క్రమంలో పంట మార్పిడి విధానాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తాం. వాణిజ్య ఇతర పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తాం.." అని ముఖ్యమంత్రి అన్నారు.

ఆహారధాన్యాలు నిలువ చేయడం
హత్యానేరం కన్నా ఎక్కువ

ఎక్కడైనా ఉత్పత్తిదారుడే వస్తువు ధరను నిర్ణయిస్తారు... కానీ ఒక రైతు పండించిన పంటకు మాత్రం ఆ అవకాశం లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు దేశంలో కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధర చట్టం తెచ్చిందని తెలిపారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువ అని సీఎం తెలిపారు. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్ళను నియంత్రించడానికి ఆనాడు కాంగ్రెస్ పకడ్బందీ చట్టం తీసుకొచ్చిందని వివరించారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. కాకపోతే అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదు ఆ తరువాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది

సన్నబియ్యం పంపిణీపై మంచి స్పందన..

నలభై ఏళ్లుగా ఇదే పథకం కొనసాగుతూ వచ్చిందని, నేడు రాష్ట్రంలో మేం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడంతో ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని సీఎం వివరించారు. ఈ సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్లో రేషన్ బియ్యం అమ్మకాలు సైతం తగ్గాయని సీఎం అభిప్రాయపడ్డారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిందని కాకపోతే అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ తరువాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లారని, అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందని, రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని వివరించారు. నలభై ఏళ్లుగా ఇదే పథకం కొనసాగుతోందని, ఆనాటి నుంచి దొడ్డు బియ్యమే ఇస్తూ వచ్చారని గుర్తు చేశారు. దొడ్డు బియ్యం తినేవారు లేక ఆ బియ్యాన్ని సన్ననియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందని ఆరోపించారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే అని పేర్కొన్నారు. దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప, పేదలకు ఉపయోగపడటం లేదని గ్రహించామని, అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామని సీఎం తెలిపారు. ఇందుకోసం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించి సన్నవడ్లు పండించాలని ప్రోత్సహించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని వివరించారు. భవిష్యత్ లో ఇది 90 శాతం కూడా కావచ్చునని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం

అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు అందించామని, రైతులకు లాభం చేకూర్చడమే కాదని, పేదల ఆకలి తీరుస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని పౌరసరఫరాల మంత్రి, శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైందని కొనియాడారు. నేటితో సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు అసెంబ్లీలో సన్నబియ్యం భోజనం పెట్టామని అన్నారు. తమ నెక్స్ట్ టార్గెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించడమేనని స్పష్టం చేశారు. అందుకే వరి ఒక్కటే కాదని, ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకే
'హేట్ స్పీచ్' బిల్లు

మొదటిపేజీ తరువాయి

అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. "అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

విమర్శలను నేరంగా పరిగణించే ప్రమాదం

బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ ఎత్తిచూపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం

'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(a) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు.

కఠిన శిక్షలపై ఆందోళన

ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పునర్విమర్శించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరిగింది

మొదటిపేజీ తరువాయి

సద్వినియోగం చేసుకొని మేము పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు. ప్రపంచం నుంచి ఎవరొచ్చిన హైదరాబాద్ అక్కున చేర్చుకుంటుందని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. స్కిల్స్ కలిగిన యువత హైదరాబాదులో ఉన్నందునే విదేశీ కంపెనీలు ఇక్కడికి పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి నిబద్ధత ముందుచూపు ప్రణాళిక ఉన్నందునే క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో జీడీపీని పెంచుకోవడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నదని అన్నారు. రాష్ట్రంలో స్టాటప్ కంపెనీలను ప్రోత్సహించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించామని, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ పద్ధతిలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ను ముందుకు తీసుకువెళ్తామని, ప్రభుత్వం నిర్దేశించుకున్న 2047 నాటి లక్ష్యానికి చేరుకొని త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడానికి పునాదులు వేసి దేశంలో అజేయంగా నిలబెడతామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది వ్యవసాయంపై ఆధారపడిన 45% ప్రజలందరికీ మేలు చేసేలా బడ్జెట్లో నిధులు కేటాయించామని తెలిపారు. పామ్ ఆయిల్ పంటలను ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఆదాయం వచ్చే వాణిజ్య పంటలపై తగిన అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించామని, మూసీ నది ఒడ్డున ఉన్న హైదరాబాదులోని మంచిరేవుల వద్ద 700 కోట్ల రూపాయలతో ఓంకారేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణం చేపట్టామని తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పుష్కర ఘాట్ల నిర్మాణానికి 351 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చేటువంటి గోదావరి పుష్కరాలను భారీ ఎత్తున నిర్వహించడానికి 500 కోట్ల రూపాయలు కేటాయించి ముందస్తు ప్రణాళికను తయారు చేసుకొని కార్యాచరణ చేపట్టామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పేరు మార్చి కాళేశ్వరం పేరిట రీడిజైన్ చేయడం వల్ల ఆదిలాబాద్ కు నీళ్లు రాలేదు తప్పనిసరిగా ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వడానికి మా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచన చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణకి జాతీయ సాగునీటి ప్రాజెక్టు ఇస్తామని ఆనాటి ప్రధానమంత్రి హామీ ఇచ్చారని, 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ ఆంధ్రప్రదేశ్లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారు కానీ తెలంగాణకు మొండి చేయి చూపారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల ఇండ్లకు సూర్యగర్ పథకం కావాలని కేంద్రాన్ని కోరామని, వీటి మంజూరి కోసం రాష్ట్రంలోని బీజేపీ ఎమ్మెల్యేలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేయాలని కోరుతున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ వల్ల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం కూడా సీరియస్ గా తీసుకున్నదని, కల్తీ నివారణకు చట్టం తీసుకొచ్చి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని తెలిపారు.

పేదల కడుపు నింపడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం మీద ఎంత ఆర్థిక భారం పడినా, పేదల కడుపు నిండాలని, వారు తినే నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 86 శాతం జనాభాకు సన్నబియ్యం అందుతున్నాయని వెల్లడించిన ఆయన, ఇప్పటివరకు మూడు కోట్ల 39 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. అడిగిన ప్రతి అర్హుడికి రేషన్ కార్డులు ఇస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అలాగే, సోనియా గాంధీ ప్రవేశపెట్టిన ఫుడ్ సెక్యూరిటీ బిల్లు తెలంగాణలో సమర్థవంతంగా అమలు అవుతోందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ఇస్తోందని, ఇప్పటివరకు రూ.40,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ఈ రెండు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

హోర్ముజ్‌ను తెరుస్తారా.. ఖర్గ్‌ను పేల్చేయాలా?

మొదటిపేజీ తరువాయి

ఏప్రిల్ 6 వరకు 10 రోజులపాటు విరామం ఇస్తున్నట్లు ట్రంప్ గతవారమే ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత ఫైనాన్షియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఇరాన్ చమురు ఎగుమతులకు జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని కూడా ప్రకటించడం గమనార్హం. ఖర్గ్ ద్వీపాన్ని మేము స్వాధీనం చేసుకోవచ్చేమో. మాకు అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నాయి అంటూ వ్యాఖ్యానించారు.

పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు.. : ఇరాన్

పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ద్వారా వచ్చే సలహాలను పాటించబోమని ఇరాన్ మంగళవారం స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించాలని తమపై ఒత్తిడి పెరిగినప్పటికీ, ఆ తరహా మధ్యవర్తిత్వ చర్చల్లో తాము పాల్గొనబోమని వెల్లడించింది. ఈ మేరకు ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్, ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరపబోమని తెలిపారు. పాక్ చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ఆ దేశం సొంత చొరవ అని, వాటిలో తాము పాల్గొనబోమని చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించే చర్చల్లో కీలక పాత్ర పోషిస్తున్నామని పాక్ ప్రకటించుకొన్న వేళ ఇరాన్ ఈ ప్రకటన చేసింది. పాక్ నిర్వహించే చర్చల్లో పాల్గొంటామని ఇరాన్, అమెరికా ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు.

ఇరాన్‌పై అణు దాడి?..
ఐక్యరాజ్యసమితిపై దౌత్యవేత్త సంచలన ఆరోపణలు

ఇరాన్‌పై అణ్వాస్త్రాల వినియోగానికి ఐక్యరాజ్యసమితి ప్రయత్నిస్తున్నదని ఐరాస టాప్ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేస్తూ తన పదవికి రాజీనామా చేశారు. యునైటెడ్ నేషన్స్ ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్‌లో పేట్రియాటిక్ విజన్ రిప్రజెంటేటివ్‌గా వ్యవహరిస్తున్న మహమ్మద్ షఫా గత వారం తన పదవికి రిజైన్ చేశారు. ఐక్యరాజ్యసమితిలోని పలు సీనియర్లు ఒక పవర్‌ఫుల్ లాబీ కోసం పనిచేస్తున్నారని, ఐక్యరాజ్యసమితికి కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. ఇరాన్‌పై అణ్వాయుధాల ప్రయోగానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో తాను భాగం కాదలచుకోలేదని ఆయన స్పష్టంచేశారు. 12 ఏండ్లపాటు ఐరాసలో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. వాషింగ్టన్, బెర్లిన్, పారిస్, లండన్‌పై ఎవరైనా అణ్వాయుధాన్ని ప్రయోగిస్తే ఏంటి పరిస్థితి అని ఆయన ప్రశ్నించారు. ఈ సమాచారం లీక్ చేసేందుకు దౌత్య కెరీర్‌ను తాను పణంగా పెడుతున్నానని, మానవత్వంపై జరుగుతున్న ఈ కుట్రలో తాను భాగం కాదలచుకోలేదని పేర్కొన్నారు.

పాతాళంలోకి రూపాయి

మొదటిపేజీ తరువాయి

వరకే ఓపెన్ పొజిషన్లు ఉంచుకునేలా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఫారెక్స్ మార్కెట్ ప్రారంభంలో 128 పైసలు లాభపడి 93.57కి చేరుకున్నది. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు రూపాయి విలువ 4 శాతానికి పైగా పతనం చెందింది. మార్చి 27న 94.82 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల అంశాలు రూపాయి పతనాన్ని ఎగదోశాయి. గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 115 డాలర్ల వద్దకు చేరుకోవడం రూపాయి పతనానికి ఆజ్యంపోశాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. ముడి చమురు పెరగడంతో దిగుమతుల భారం మరింత పెరుగుతున్నదన్న అంచనాతో మదుపరులు ఆందోళనకు గురయ్యారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూపాయికి అచ్చిరాలేదు. ఈ ఏడాది ఏకంగా రూపాయి విలువ 10 శాతం వరకు నష్టపోయింది. గడిచిన 14 ఏండ్లలో ఇదే అతిపెద్ద పతనం కావడం విశేషం. 201112లో అత్యధికంగా 12.4 శాతం పడిపోయిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు గురికావడం, ద్రవ్య లభ్యత పరిస్థితులు మరింత కఠినతరం కావడం రూపాయి పతనానికి ఆజ్యంపోసింది. కరెన్సీ పతనానికి అడ్డుకట్ట వేయడానికి రిజర్వుబ్యాంక్ గత మూడు నెలల్లో 55.073 బిలియన్ డాలర్లను విక్రయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

ప్రధానిమోదీ తనను, తన వ్యక్తిగత ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికే ప్రయత్నిస్తున్నారు. ఆయన భారత భవిష్యత్తును తాకట్టు పెట్టారనే విషయం ప్రజలకు తెలుసు. మోదీ పాలనలో డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం రూ.100 దిశగా సాగుతోంది. స్టాక్స్, ఎకానమీ, ఇన్‌కమ్, సేవింగ్స్ పడిపోయాయి. ఉద్యోగాలు మాయమయ్యాయి. సిలిండర్లు అందుబాటులో లేవు. వీటన్నిటికీ మోదీ రాజీపడటమే కారణం.
- విపక్షనేత రాహుల్ గాంధీ

'జీవో 317' బాధితులకు న్యాయం చేయండి

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారని గుర్తు చేశారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాలు, జోన్ల వారీగా సర్దుబాటు చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జీవో నంబర్ 317 జారీ చేసిందని తెలిపారు. కానీ ఆ జీవోలోనూ స్థానికతపై స్పష్టత లేకపోవడంతో వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జీవో 317తో ఉద్యోగులు, టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అప్పటి సీఎం కేసీఆర్ కు పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు లేఖ రాశారని గుర్తు చేశారు.

న్యాయం చేస్తామని హామీ ఇచ్చి..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపిస్తే జీవో 317ను సమీక్షించి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. జీవో 317 బాధితుల సమస్యకు పరిష్కారం చూపిస్తామంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారని, కానీ ఇప్పటి వరకు ఆ నివేదిక ప్రభుత్వం బయట పెట్టలేదన్నారు. ఆ నివేదిక వెలుగులోకి వస్తే తప్ప జీవో 317 బాధితులు ఎంత మంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని అసెంబ్లీ సాక్షిగా మీ మంత్రి ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదన్నారు. ఇప్పటి వరకు ఈ అంశంపై కేంద్రానికి కనీసం లేఖ కూడా రాయలేదంటే ఉద్యోగుల సమస్యలంటే మీకు ఎంతటి పట్టింపులేని తనం ఉందో స్పష్టమవుతుందన్నారు. వెంటనే జీవో 317 బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్థానికత నిబంధనల మార్పుతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికతను గుర్తించే నిబంధనల్లో మార్పులు చేసి ఈ మట్టి బిడ్డలకు తీరని అన్యాయం చేశారని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు తెలంగాణలో చదవిన వారిని స్థానికులుగా గుర్తిస్తామనే నిబంధన కారణంగా ఇంటర్మీడియెట్ చదివేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న ఈ ప్రాంత బిడ్డలు స్థానికేతురులు అయిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే హైదరాబాద్ సమీప ప్రాంతాలకు వచ్చి ఇక్కడ ఇంటర్మీడియెట్ వరకు చదివే వాళ్లు స్థానికులు అయి మన వాళ్లకు దక్కాల్సిన అవకాశాలు కొళ్లగొడుతున్నారని తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్ల పాటు ఏ రాష్ట్రం, జిల్లాలో చదివితే అక్కడి స్థానికులుగా గుర్తించే పాత ఉత్తర్వులను మళ్లీ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లు, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు కనీసం శానిటరీ ప్యాడ్స్ అందించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈమేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'ఎక్స్'లో సోమవారం పోస్ట్ పెట్టారు. 'పీఎం శ్రీ' పథకం కింద ఇతర స్కూళ్లలో ఇస్తున్నట్టే ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతినెలా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు.

‘కాళేశ్వరం’ పేరుతో రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృథా

- రాజ్యసభలో జల్‌శక్తి మంత్రి సీఆర్‌పాటిల్ కీలక వ్యాఖ్యలు
- ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమన్న మంత్రి
- జల్‌జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది
- మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ప్రతిపాదన పంపలేదు



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 30: రాజ్యసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని సీఆర్ పాటిల్ రాజ్యసభలో ఆరోపించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రధానమంత్రి కృషిసించాయీ యోజన పథకం కింద కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని బీఆర్ఎస్ సభ్యుడు సురేశ్ రెడ్డి కోరారు. సురేష్ రెడ్డి వేసిన ప్రశ్నకు తీవ్ర స్థాయిలో జలశక్తి శాఖ మంత్రి స్పందించారు. ఇందుకు సమాధానమిచ్చిన కేంద్రమంత్రి కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని వివరించారు. రూ.30 వేల కోట్లు ఖర్చు చేసి అనుమతుల కోసం కేంద్రం దగ్గరికి వచ్చారని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్ఎస్‌డీఏ నివేదికను ప్రస్తావించిన కేంద్రమంత్రి ప్రాజెక్టు లోపాలపై కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లుగా ఒక్క ప్రతిపాదన పంపలేదు

కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరగా జల్‌జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ప్రతిపాదన పంపలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వద్ద జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.873 కోట్లు ఉన్నట్టు తెలిపారు. అయినా మూడు సంవత్సరాల్లో కేవలం రూ.194 కోట్లే ఖర్చు చేశారని చెప్పారు.

దేశవికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిది

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- లోక్ భవన్‌లో రాజస్థాన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 30 : దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిదని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సోమవారం లోక్ భవన్ లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా రాజస్థాన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ లో ఉంటున్న రాజస్థాన్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ దేశంలో సంస్కృతి, సాంప్రదాయాల పరంగా రాజస్థాన్‌కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. భగవాన్ శ్రీ రాముడు, జన్మభూమి స్వర్గం కంటే మిన్న అని చెప్పారని, వారి స్ఫూర్తితోనే రాజస్థాన్ ప్రజలు దేశ అభివృద్ధి, సాంస్కృతిక వికాసీనికి గొప్ప సేవ చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. గవర్నర్ సందేశం అనంతరం ఏర్పాటు చేసిన రాజస్థాన్ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణాచారి, ఇతర లోక్ భవన్ ఉన్నతాధికారులు, రాజస్థాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యుద్ధం ఆపడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి

- అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 30: పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య మొదలైన యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన భారత ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తగిన చొరవ తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఈ తీర్మాణాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రూడాయిల్ (పెట్రోల్, డీజిల్, గ్యాస్) లాంటి వాటిపై ప్రతీ దేశ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేసే విషయం మన అందరికి తెలుసని, క్రూడాయిల్ ఉత్పత్తి రవాణాల ఈ యుద్ధ ప్రభావానికి లోనై సరఫరాలో ప్రభావం చూపిస్తుందని అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్, లెబనాన్ మీద దాడి చేస్తున్నాయని, అలాగే ఇరాన్ కూడా గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్న అమెరికా చెందిన డిఫెన్స్ స్థావరాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేస్తుందని అన్నారు. ఈ ఆర్థిక విధ్వంసం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. మరీ ముఖ్యంగా ఆసియా దేశాలకు మరింత ప్రమాదకరంగా మారిందని, మన దేశం పైన కూడా తీవ్రమైన ప్రభావం కనపడుతుందని ఆయన అన్నారు. కనీసం ఇంతటితో నైనా ఈ యుద్ధాన్ని ఆపకపోతే ప్రపంచ భవష్యత్తు ఆందోళనకరంగా మారుతుందని, ఇటువంటి అత్యంత ప్రమాదకర పర్యవసనాల దృష్ట్యా భారత ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి చొరవ తీసుకోవాలని అన్నారు.



న్యాయవాదుల రక్షణ చట్టం ఆమోదంపై హర్షం

- రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 30: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అసెంబ్లీలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించడం పట్ల షాద్ నగర్ పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసమూర్తి, కోశాధికారి రహీముద్దీన్, లైబ్రరీ సెక్రెటరీ జయమ్మ , ఎగ్జిక్యూటివ్ మెంబర్లైన రూప్ సింగ్, పబ్బే శ్రీశైలం, గూడూరు గణేష్, నరేష్ కుమార్, సంతోష్ నాయక్, సాత్విక, సునీత లతో పాటు పలువురు సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులతోపాటు న్యాయవాదులు కనకగిరి మోహన్ రావు, కెవిడి చారి, డి నరసిమ్ములు, శ్రీనివాస్ యాదవ్,శ్రీధర్ గౌడ్, చీపిరి చంద్రశేఖర్, గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఖలీల్, కే శంకరయ్య, సుధాకర్ రెడ్డి, విజయ్ కుమార్ గౌడ్, విజయ భాస్కర్, ప్రశాంత్, మాధవ రెడ్డి బేరి శ్రీనివాసులు, మహిళ న్యాయవాదులు షహనాజ్, రిషితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీకి భారీ నిధులు

- సీఎం రేవంత్ రెడ్డికి వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి ధన్యవాదాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30 : డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అభివృద్ధికి తాజా బడ్జెట్లో నిధుల కేటాయింపునకు సంబంధించి వైస్‌ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి, యూనివర్సిటీ అన్ని విభాగాల డైరెక్టర్లు ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. డా.బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం భవన నిర్మాణం కోసం రూ. 100 కోట్లు, పలు అభివృద్ధి పనుల కోసం రూ. 50 కోట్ల గ్రాంటును, అదేవిధంగా ఉద్యోగుల జీత భత్యాల కోసం రూ.: 24.30 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సోమవారం యూనివర్సిటీలో నిర్వహించిన అన్ని విభాగాల అధిపతుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డా. యోగితా రాణాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను విద్యార్థులకు ఉపయోగపడేలా మౌళిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నట్లు వీసీ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ప్రొ. పుష్పా చక్రపాణి, డైరెక్టర్లు, డీన్లు ప్రొ. ఆనంద్ పవార్, ప్రొ. రబీంద్ర నాథ్ సోలమన్, ప్రొ. పల్లవీ కాబడే, ప్రొ. శ్రీదేవి, ప్రొ. వెంకట రమణ, ప్రొ. భోజు శ్రీనివాస్, ప్రొ. చంద్రకళ, ప్రొ. రాణి రజిత మాధురి, డా. వై. వెంకటేశ్వర్లు, డా. ఏ.రమా దేవి, ఫైనాన్స్ ఆఫీసర్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు మనం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- కమిటీలు వేసి కాలయాపన చేయొద్దు
- శాసన మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30: ఉద్యమకారులకు మనం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రశ్నించారు. ఉద్యమకారులను గుర్తించడంలో కమిటీలు వేసి కాలయాపన చేయొద్దని, శాసన మండలిలో సొంత ప్రభుత్వంపై ఆమె మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఉద్యమకారుల బాధలను సభలో ప్రశాంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం, నెలకు అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చాం... కానీ, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయింది.. అయినా ఉద్యమ కారులకు ఇంకా ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. మాకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని? ఉద్యమకారులు అడుగుతున్నారని సభలో నిలదిశారు. జూన్ 2న తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చాం.. అది ఇంకా ఇవ్వలేదు. ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్ చేశారు. అధికార పార్టీలో ఉంటూ, అధికార పార్టీ ఎన్నికల హామీపై ఉద్యమకారుల తరపున మాట్లాడిన ఫైర్ బ్రాండ్ విజయశాంతికి ఉద్యమకారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఐఐఎఫ్ఎల్‌ఫైనాన్స్ గోల్డ్ లోన్ బ్రాంచ్ ప్రారంభం

షాద్ నగర్ పట్టణం ఎంపీడీఓ ఆఫీస్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐఎఫ్ఎల్‌ఫైనాన్స్ , గోల్డ్ లోన్ 2వ బ్రాంచ్ ను షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను కంపెనీ యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి, ట్రాన్స్ జెండర్ విద్యార్థులకు జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఫెలోషిప్స్

- సమతా స్కీం కింద ఆర్థికంగా అండ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30 : డా. బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో చేరిన ఆదివాసీ, ట్రాన్స్ జెండర్ విద్యార్థులకు ఆర్థికంగా చేయూతను ఇవ్వడానికి జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఈ మేరకు అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, ఆ ఫౌండేషన్ చైర్మన్, ఓ సాఫ్ట్వేర్ సంస్థ (అమెరికా) అధినేత దూదిపాల జ్యోతి రెడ్డి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణిని కలిసి ప్రతిపాదనలు అందించారు. వరంగల్ జిల్లాకు చెందిన ఓ మారుమూల గ్రామంలో వ్యవసాయ కూలీగా తన జీవితాన్ని ప్రారంభించి, ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివి అంచెలంచలుగా ఎదిగి అమెరికాలో సాఫ్ట్వేర్ కంపెనీ నడుపుతున్న జ్యోతి రెడ్డి తనకు జీవితాన్ని, గుర్తింపును ఇచ్చిన విద్యాసంస్థకు ఏదైనా మేలు చేయాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యాభ్యాసానికి దూరంగా ఉన్న ఆదివాసీ తెగలకు, ట్రాన్స్ జెండర్ లకు ఆర్థికంగా చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. జ్యోతి రెడ్డి ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి ఈ విషయంపై త్వరలోనే అధికారులతో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. తమ విశ్వవిద్యాలయంలో అభ్యసించి ఎదగడమే కాకుండా ఆదివాసీల, ట్రాన్స్ జెండర్ ల అకాడమిక్ కెరీర్ అభివృద్ధికి పాటు పడతానని ఓ పూర్వ విద్యార్థి ముందుకు రావడం చాలా గర్వంగా ఉందని, ఇది పలువురికి ఆదర్శవంతంగా మారనుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సమ్మి రెడ్డి, రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పా చక్రపాణి, వీసీ ఓఎస్డీ ప్రొ. రవీంద్రనాథ్ సోలమన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం ఆమోదం హర్షణీయం

- సీఎంకు తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుల కృతజ్ఞతలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30 : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు గోకుల్ రామారావు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా న్యాయవాదులపై వివిధ రకాల దాడులు, హత్యలు, హత్యాయత్నాలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు తమకు రక్షణ చట్టం కావాలని నిరంతరం పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్ట అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం, ఈరోజు అసెంబ్లీలో ఆ చట్టాన్ని ప్రవేశపెట్టడం ఆనందకరమైన విషయం అని ఆయన అభిప్రాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు విప్లవ రెడ్డి మాట్లాడుతూ, న్యాయవాదుల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చుతూ ప్రభుత్వం ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శి వోద్యారపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బొడ్డు రమేష్‌కుమార్, న్యాయవాది రాందేని చంద్రమౌళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇందిరా పార్కులో కబ్జాలకు చెక్

- పాత స్కేటింగ్ రింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా
- పార్కులో కలపాలంటూ హైడ్రా కమిషనర్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 30: లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఇందిరా పార్కు కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. పార్కులో వాకింగ్ ట్రాక్ లకు తోడు పిల్లలు ఆడుకునేందుకు చుట్టూ ఏర్పాటు చేసిన స్థలాల కబ్జాలపై హైడ్రా కన్నెర్రజేసింది. పాత స్కేటింగ్ రింగ్ కబ్జాకు గురౌతోందని ప్రజావాణిలో వాకర్స్ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ సామగ్రితో పాటు, ఇందిరాపార్కు లోపలి వైపు ఉన్న ప్రహరీ తొలగించడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణాలను ఆపించి.. ప్రహరీని పునరుద్ధరించాలని ఆదేశించారు. కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి వచ్చినందున.. పాతదాన్ని ఇందిరాపార్కులో విలీనమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఇందిరాపార్కు లోపలి వైపు నుంచి స్కేటింగ్ రింగులోకి వెళ్లేందుకు వీలుగా ప్రహరీని కూల్చిన రవీందర్ రెడ్డిపై దోమలగూడ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. సోమవారం హైడ్రా కమిషనర్ ఈ పరిణామాలన్నిటినీ పరిశీలించి.. కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పాత స్థలాన్ని ఇందిరా పార్కులో కలిపేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ‘వీబీ జీ రామ్ జీ’

- ఆ పథకాన్ని సమర్థించడం సరికాదు
- బీజేపీ సభ్యుడు మహేశ్వర్ రెడ్డికి మంత్రి దుద్దిళ్ల కౌంటర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 30: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ‘వీబీ జీ రామ్ జీ’ పథకాన్ని సమర్థిస్తూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ‘వీబీ జీ రామ్ జీ’ వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని మీ కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లండి.. రాష్ట్రానికి మేలు చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం చేయండి.. ఈ బాధ్యత బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. సోమవారం అసెంబ్లీలో శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చిన పథకం ఉపాధి హామీ అని, అలాంటి గొప్ప పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నీరు గార్చిందని అన్నారు. ఉపాధి హామీ పథకం గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ సభ్యులకు లేదని అన్నారు. కొత్త పథకం వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే స్పందించకుండా ఇప్పుడు మాపై విమర్శలు చేస్తారా? అని ప్రశ్నించిన ఆయన ఉపాధి హామీ పథకంలో జాతిపిత మహాత్మాగాంధీ పేరును తొలగించడం శోచనీయం అని అన్నారు.

రావణుడి వల్లే రాముడి గొప్పతనం తెలిసింది. కేసీఆర్ ఉండటం వల్లే నాకు గుర్తింపు వచ్చింది. ఆయన లేకపోతే నేను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదు. కేసీఆర్ రెస్ట్ తీసుకుంటున్నారని అంతా అనుకుంటున్నారు, కానీ నా అనుమానం ప్రకారం ఆయనను గృహ నిర్బంధం చేశారు.
- సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
మంగళవారం
31.03.2026
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

తగ్గుతున్న కమ్యూనిస్టుల ప్రాభవం

భారత రాజకీయ చరిత్రలో ఒకప్పుడు శక్తివంతమైన శక్తిగా, పేద ప్రజల గొంతుకగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు నామమాత్రంగా మిగిలాయి. ప్రజల తరపు, కార్మికుల తరఫున ఎన్నో పోరాటాలుచేసి, హక్కుతు సాధించిన కమ్యూనిస్టులను ఇప్పుడు పట్టించుకునేవారు తగ్గిపోతున్నారు. ఉద్యమాల వరకు మాత్రమే వాటిని ఆదరిస్తున్నారు. ప్రజా ప్రదినిధులుగా చట్ట సభలకు మాత్రం పంపడం లేదు. ఇందుకు కారణం వారు అనుసరిస్తున్న బూర్జువా విధానాలే. తాజాగా సీపీఎం (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా - మార్క్సిస్ట్) నేత ప్రకాశ్ కారత్ విజయవాడలో చేసినవ్యాఖ్యలు ఈ పార్టీల పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ప్రధాని మోదీ విదేశాంగ విధానంపై, ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధంపై భారత వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. కానీ ఈ విమర్శలు వాస్తవ భౌగోళిక రాజకీయాలకు దూరంగా, ఆదర్శవాదపు కోణంలోనే ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రధాని మోదీ అమెరికాకు సాగిలపడ్డారని కారత్ ఆరోపించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను భారత్ ఖండించకపోవడాన్ని ఆక్షేపించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను ఖండించకపోవడంపై విమర్శలు చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై భారత వైఖరిని 'దారుణం'గా ఉందని అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలు వినడానికి భావోద్వేగపూరితంగా అనిపించినా, వాస్తవ భౌగోళిక రాజకీయాల దృష్ట్యా ఇవి అప్రాయోగికం. భారత్ ప్రస్తుతం బహుళ ధ్రువాల విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోంది. ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇజ్రాయెల్‌తో రక్షణ సహకారం దేశ జాతీయ ప్రయోజనాలకు కీలకం.రష్యాతో భారత్ స్నేహంపై ఇప్పటికే అమెరికా అసంతృప్తిగా ఉంది. టారిఫ్‌లు, ఆర్థిక ఒత్తిళ్లు విధిస్తోంది. ఇరాన్ దాడులను ఖండిస్తే అమెరికా మరింత ఆగ్రహించి, పాకిస్తాన్‌ను చేరదీసే ప్రమాదం ఉంది. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇజ్రాయెల్ భారత్‌కు ఆయుధ సాయం అందించింది. ఇరు దేశాల మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతిక రంగాల్లో గాఢమైన సహకారం ఉంది. ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తే ఈ సత్సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.ఇరాన్‌తో భారత్‌కు చమురు సరఫరా, చాబహార్ ఓడరేవు వంటి వ్యూహాత్మక అవసరాలు ఉన్నాయి. కానీ కశ్మీర్ అంశంలో ఇరాన్ పాకిస్తాన్‌కు మొగ్గుచూపడం గమనార్హం. కశ్మీరీలు ఇరాన్ ప్రజలకు విరాళాలు పంపించగా, ఇరాన్ కశ్మీర్‌ను, భారత్‌ను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని ట్వీట్ చేసింది. దీనికి పాకిస్తాన్ అభ్యంతరం చెప్పగానే ఆ ట్వీట్‌ను తొలగించింది. ఇది ఇరాన్ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తుంది.రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఒకప్పుడు బలంగా ఉండేవి. ఈశాన్య రాష్ట్రాలు, కేరళలో అధికారంలో ఉండేవి. కానీ కాలానుగుణంగా మారకపోవడం, పాత విధానాలనే అవలంబిస్తుండడంతో కమ్యూనిస్టులకు ఆదరణ తగ్గుతోంది. 2004లో సీపీఎంకు 40కిపైగా ఎంపీలు ఉన్నారు. నాడు యూపీఏ ప్రభుత్వం సీపీఎం మద్దతుతోనే ఏర్పడింది. కానీ 2014 నాటికి 9 సీట్లకు పడిపోయింది. 2019లో కేవలం 3 సీట్లు గెలిచింది. 2024లో 4 స్థానాల్లో విజయం సాధించింది. కమ్యూనిస్టు పార్టీలు ఇప్పటికీ 20వ శతాబ్దపు ఆదర్శాలతోనే బతికున్నాయి. మారుతున్న భౌగోళిక రాజకీయాలను, వ్యూహాత్మక అవసరాలను అర్థం చేసుకోలేకపోతున్నాయి. ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, భారత ఆర్థిక వ్యవస్థ మార్పులకు అనుగుణంగా తమ సిద్ధాంతాలను మార్చుకోలేదు. దేశ అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించే సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉంది. కానీ వారు ఎప్పుడూ ప్రతిపక్ష పాత్రకే పరిమితమయ్యారు. విమర్శలు చేయడం తప్ప, పరిష్కారాలు సూచించడంలో విఫలమయ్యారు. 'నేలవిడచి సాము చేయడం' వల్ల ప్రజాదరణ కోల్పోయారు. సీపీఎం, సీపీఐల మధ్య మాత్రమే కాకుండా, పార్టీల లోపల కూడా తీవ్ర విభేదాలు ఉన్నాయి.ఒకప్పుడు కార్మికులు, రైతాంగం మధ్య బలమైన పునాది ఉన్న కమ్యూనిస్టు పార్టీలు, ఇప్పుడు ఆ వర్గాల నుంచి కూడా దూరమయ్యాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు, రైతు పోరాటాల్లో పార్టీల పాత్ర క్షీణించింది. భారత్ కమ్యూనిస్టు విధానాలను అనుసరిస్తే చాలా దేశాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
31.03.2026

చరిత్ర రచనలో, పరిశోధనలో హిస్టిరోగ్రఫీ ప్రాధాన్యత

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

చరిత్ర అనేది కేవలం గత కాలపు సంఘటనలను తేదీలు, పేర్లు, యుద్ధాలు గుర్తుపెట్టుకోవడం మాత్రమే కాదు. అది గతాన్ని అర్థం చేసుకోవడం, విశ్లేషించడం మరియు వర్తమానానికి సంబంధింప చేయటం. ఇక్కడే "హిస్టిరోగ్రఫీ" (Historiography) అనే అంశం ముఖ్యమవుతుంది. ఇది చరిత్ర రచనా శాస్త్రం లేదా "చరిత్ర యొక్క చరిత్ర" అని కూడా అంటారు. చరిత్ర పరిశోధక విద్యార్థులకు ఇది అత్యంత ముఖ్యమైన సాధనం. ఎందుకంటే ఇది గతాన్ని ఎలా చూశారు, ఎందుకు అలా రాశారు, ఏ బాధ్యతలు ఉన్నాయి అనే విషయాలను తెలియజేస్తుంది.

1. హిస్టిరోగ్రఫీ అంటే ఏమిటి?:
హిస్టిరోగ్రఫీ అనేది చరిత్రకారులు గతాన్ని ఎలా రాశారు? ఏ పద్ధతులను వాడారు?, ఏ సాక్ష్యాలను ఎంచుకున్నారు?, ఏ దృక్పథాలతో విశ్లేషించారు ? అనే అన్ని విషయాలను సమగ్రంగా అధ్యయనం చేయటానికి ఉపయోగించే సాధనం. ఇది సంఘటనలను నేరుగా అధ్యయనం చేయదు. బదులుగా, "చరిత్రకారులు ఆ సంఘటనలను ఎలా?ఎన్ని కోణాల్లో చూశారు?" అని ప్రశ్నిస్తుంది.
ఉదాహరణకు: ఒక యుద్ధం గురించి ఒక చరిత్రకారుడు "విజయం"గా రాస్తే, మరొకరు "దురంతం"గా రాస్తే ...ఇది హిస్టిరోగ్రఫీలో చర్చ అవుతుంది. ఎందుకంటే చరిత్రకారుని కాలం, సమాజం, రాజకీయాలు, వ్యక్తిగత ఆలోచనలు ఆ రచనను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక సాధారణ కథ కాదు. ఇది చరిత్ర రచనా పద్ధతి, మూలాలను విశ్లేషణ చేయటం, బయాస్ (పక్షపాతం) లేకుండా శాస్త్రీయ పద్ధతులను గురించిన అధ్యయనం. ప్రపంచంలో హిస్టిరోగ్రఫీ ఆధునిక రూపం 1819వ శతాబ్దాల్లో ఏర్పడింది. గ్రీకు చరిత్రకారుడు హెరోడోటస్‌ను "చరిత్ర పితామహుడు" అంటారు. కానీ ఆధునిక చరిత్ర రచనలో జర్మన్ చరిత్రకారుడు లెయోపోల్డ్ వాన్ రాంకే "గతాన్ని ఎలా జరిగిందో అలాగే రాయాలి" అని శాస్త్రీయ పద్ధతిని ప్రవేశపెట్టారు.

2. చరిత్ర రచనలో హిస్టిరోగ్రఫీ ప్రాధాన్యత:
చరిత్ర రాయడం సులభం కాదు. అది కేవలం వాస్తవాలను కాపీ చేయడం కాదు. హిస్టిరోగ్రఫీ ఇక్కడ సహాయపడుతుంది:
పక్షపాతాలను గుర్తించడం: చరిత్రకారులు తమ కాలపు సమాజం, రాజకీయాలు, మతం ద్వారా ప్రభావితులవుతారు. హిస్టిరోగ్రఫీ ఈ పక్షపాతాన్ని(బయాస్)ను ఎత్తి చూపిస్తుంది. ఉదాహరణ: బ్రిటిష్ చరిత్రకారులు భారత చరిత్రను "భారతీయులు బార్బర్‌లు, బ్రిటిష్‌వారు వారిని సివిలైజ్ చేశారు" అని రాశారు. హిస్టిరోగ్రఫీ ఈ దృక్పథాన్ని విశ్లేషిస్తుంది.
వివిధ దృక్పథాలను అర్థం చేసుకోవడం: ఒకే సంఘటనకు వేర్వేరు వివరణలు ఉంటాయి. హిస్టిరోగ్రఫీ ఈ మార్పులను చూపిస్తోంది.కొత్త సాక్ష్యాలు వచ్చినప్పుడు, సమాజం మారినప్పుడు చరిత్ర కూడా మారుతుంది.
మంచి రచనకు ఆధారం: హిస్టిరోగ్రఫీ తెలిస్తే మీ రచన సమతుల్యంగా, శాస్త్రీయంగా ఉంటుంది. కేవలం కథ చెప్పకుండా, ఎందుకు ఇలా జరిగింది అని కార్యా,కారణ, కారకాల ప్రభావాలను వివరిస్తుంది.

3. పరిశోధనలో హిస్టిరోగ్రఫీ ప్రాధాన్యత:
పరిశోధక విద్యార్థులకు హిస్టిరోగ్రఫీ ఒక "కంపాస్" లాంటిది. ఇది లేకుండా పరిశోధన అసంపూర్ణం.

ఇప్పటికే ఉన్న పరిశోధనను అర్థం చేసుకోవడం ఎలా?: ఒక నిర్దిష్ట అంశంపై ఇప్పటికే ఎవరు ? ఏమి రాశారు? ఏ దృక్పథాలను అనుసరించి అవి ఉన్నాయి? హిస్టిరోగ్రఫీ ఈ "సంభాషణ"ను చూపుతుంది. ఇది మీ పరిశోధనను ఇప్పటి వరకు ఉన్న చర్చలో భాగం చేస్తుంది.
చరిత్ర రచనలో ఖాళీలను (Gaps) గుర్తించడం: ఏ అంశం ఇంకా పరిశోధించాల్సి ఉంది? ఏ దృక్పథం నుంచి చూడాలి? ఇది మీకు కొత్త ప్రశ్నలను ఇస్తుంది.
సాక్ష్యాల విశ్లేషణ: ప్రాథమిక సాక్ష్యాలు (పురావస్తు, శాసనాలు, దినచర్యలు)ను ఎలా వాడాలో నేర్పుతుంది. రెండవ స్థాయి సాక్ష్యాలు (ఇతర చరిత్రకారుల రచనలు)ను విమర్శనాత్మకంగా చదవడం నేర్పుతుంది.
నిష్పక్షపాతం: సాధ్యం అయినంత వరకు మీ సొంత బయాస్‌ను గుర్తించి, సమతుల్య రచన చేయడానికి సహాయపడుతుంది.
హిస్టోరియోగ్రాఫిక్ ఎస్సే: పరిశోధనా పత్రాల్లో ఈ భాగం ఉంటుంది. ఇది మీ పనిని ఇతరుల పనితో అనుసంధానం చేస్తుంది. హిస్టిరోగ్రఫీ లేకుండా చరిత్ర పరిశోధన "కేవలం కథ చెప్పడం"గా మారిపోతుంది. ఇది ఉంటే అది "శాస్త్రీయ విశ్లేషణ" అవుతుంది.

4. భారత చరిత్రలో హిస్టిరోగ్రఫీ. వివిధ సంప్రదాయాలు:
భారతదేశంలో హిస్టిరోగ్రఫీ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రాచీన కాలంలో ఇతిహాసపురాణ సంప్రదాయం ఉంది (రామాయణం, మహాభారతం). కానీ ఆధునిక రూపం బ్రిటిష్ కాలంలో వచ్చింది.
కాలొనియల్ / ఇంపీరియల్ స్కూల్: జేమ్స్ మిల్, విన్సెంట్ స్మిత్ వంటి బ్రిటిష్ చరిత్రకారులు. భారత చరిత్రను "హిందూముస్లిం విభజన"గా చూశారు. బ్రిటిష్ పాలనను "ప్రగతి"గా చూపించారు.
నేషనలిస్ట్ స్కూల్: స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆర్.జి. భండార్కర్, జదునాథ్ సర్కార్ వంటివారు. కాలనియల్ దృక్పథాన్ని ఖండించి, భారత సంస్కృతి గొప్పతనాన్ని చూపారు.
మార్క్సిస్ట్ స్కూల్: డి.డి. కోసాంబి, ఆర్.ఎస్. శర్మ, రోమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్. ఆర్థిక, వర్గ సంబంధాలు, సామాజిక మార్పులపై దృష్టి పెట్టారు.
సబాల్టర్న్ స్కూల్: రణజిత్ గుహ నాయకత్వంలో. సామాన్య ప్రజలు, దళితులు, మహిళలు, ఆదివాసుల గొంతుకను చరిత్రలో చేర్చారు. "ఎలైట్" చరిత్రను విమర్శించారు. ఇవి కాకుండా ప్రపంచంలో అన్నలెస్ స్కూల్ (సామాజికఆర్థిక చరిత్ర), పోస్ట్ మోడర్న్ (సత్యం సాపేక్షం అని), ఫెమినిస్ట్ స్కూల్ వంటివి కూడా ఉన్నాయి.

5. పరిశోధక విద్యార్థులకు సూచనలు:
ప్రతి అంశానికి ముందు హిస్టిరోగ్రఫీ సమీక్ష చేయండి. వివిధ స్కూల్స్ రచనలను పోల్చి చదవండి.మీ సొంత దృక్పథాన్ని స్పష్టంగా చెప్పండి, కానీ ఇతరులను గౌరవించండి.కొత్త సాక్ష్యాలు (డిజిటల్ ఆర్కైవ్స్,ఆర్కియాలజీ)తో పాత రచనలను సవాలు చేయండి.తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనూ చదవండి. స్థానిక చరిత్రకు తెలుగు సాహిత్యం చాలా ఉపయోగపడుతుంది. చివరిగా... హిస్టిరోగ్రఫీ చరిత్రను "జీవవంతం" చేస్తుంది. ఇది గతాన్ని కేవలం గుర్తుచేసుకోవడం కాదు. దాన్ని సంపూర్ణంగా అన్ని కోణాల నుండి అర్థం చేసుకోవడం, విమర్శించడం, మెరుగుపరచడం. పరిశోధక విద్యార్థులకు ఇది ఒక శక్తివంతమైన ఆయుధం. దీనిని సరిగ్గా అర్థం చేసుకుంటే మీ చరిత్ర రచన నిజమైన ప్రభావం చూపుతుంది. చరిత్ర కేవలం పుస్తకాల్లో కాదు. అది మన ఆలోచనల్లో, సమాజంలో జీవిస్తుంది. హిస్టిరోగ్రఫీని అధ్యయనం చేయడం ద్వారా పరిశోధన చేసే విద్యార్థులు ఆనాటి జీవితానికి సంబంధించిన లోతైన సత్యాల, వాస్తవిక అనుభవాలలో భాగస్వాములు అవుతారు. ఈ ప్రాథమిక అవగాహనతో చరిత్ర పై పరిశోధనలు చేసే రీసెర్చ్ స్కాలర్లకు సమగ్రంగా, ఆకర్షణీయ అంశాలు చరిత్ర ను తవ్వినా కొద్ది నిజాలు బయట పడతాయి.వ్యక్తిగత ఊహలు, కల్పితాలు, అపోహలు చరిత్ర రచనకు పనికి రావు.నిఖార్సు అయిన పురావస్తు రుజువులు అవసరం.

వ్యవసాయ కూలీల శ్రేయస్సు మన కనీస బాధ్యత!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారతీయ నాగరికతకు వ్యవసాయంతో విడదీయరాని సంబంధం అన్నది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతన్న. అన్నదాత నాగలి సాగితేనే మన కంచంలో ముద్ద ప్రత్యక్షం అవుతుంది. కర్షకుడి చేమట తేమతో పంటలు పండుతున్నాయి. రైతన్న సాగుబడికి వ్యవసాయ కూలీలు కూడా తోడ్పడుతున్నారు. కలుపు తీయడం, నాట్లు వేయడం, పురుగు మందులు స్ప్రే చేయడం, కోతలు కోయడం, దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా లాంటి పలు పనులకు వ్యవసాయ కార్మికులు పునాదిగా నిలుస్తున్నారు. వ్యవసాయ భూమి యజమాని లేదా కౌలుదారుడు కర్షకుడిగా పలువబడుతూ నిత్యం శ్రమిస్తున్నాడు. వ్యవసాయ పనులకు రైతు వినియోగించుకునే మానవ వనరులను వ్యవసాయ కార్మికులు/కూలీలుగా పరిగణించాలి. వ్యవసాయ క్షేత్రంలో పని చేసే వ్యక్తులను వ్యవసాయ కూలీలు లేదా వ్యవసాయ కార్మికులుగా పిలుస్తున్నాం. భూమి యజమాని ఆదాయం, పంట పెట్టుబడులు, లాభ నష్టాలతో వ్యవసాయ కూలీలకు సంబంధం ఉండదు. జాతీయ వ్యవసాయ కార్మికులు/కూలీల దినోత్సవం: రైతు కూలీల సమస్యలను అవగాహన చేసుకోవడం, ఆ వర్గాలకు మేలు కలిగే చర్యలు తీసుకోవడం లాంటి అంశాల చర్చలకు వేదికగా "జాతీయ వ్యవసాయ కూలీల/కార్మికపు దినోత్సవం (నేషనల్ ఫార్మ్ వర్కర్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రతి ఏటా 23 డిసెంబర్ రోజున మన దేశంలో "జాతీయ రైతు దినోత్సవం" పాటిస్తున్నామని గమనించండి. 2014లో యూఎస్‌లో ప్రారంభంపైన జాతీయ వ్యవసాయ కార్మికపు దినోత్సవం నేడు ప్రపంచవ్యాప్తంగా పాటించడం అత్యవసరంగా తోస్తున్నది. పలు అధ్యయనాల ప్రకారం భారతదేశంలో దాదాపు 600 మిలియన్ల రైతులు, వ్యవసాయ కూలీలు దేశానికి ఆహార ధాన్యాలను పండిస్తున్నారు. భారత దేశ కార్మికుల్లో 46 శాతం వరకు వ్యవసాయ కూలీలుగా శ్రమిస్తున్నారు. దాదాపు 70 మిలియన్ల రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలు ఉన్నాయి.

వ్యవసాయ కూలీల సమస్యలు అనేకం:
వ్యవసాయ కార్మికులు లేనిదే సాగుబడి జరగదు. వ్యవసాయ కూలీల వ్యథలు వర్ణనాతీతం. వ్యవసాయ కూలీల్లో మహిళల ప్రాధాన్యం ఎక్కువ. భారతంలో యూపీ, ఎంపీ, హర్యానా, తెలంగాణ, రాజస్థాన్, ఏపీల్లో వ్యవసాయదారులు లేదా రైతులు అత్యధికంగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న వ్యవసాయ కూలీ ప్రధాన సమస్యల్లో స్వల్ప వేతనాలు, పని కొరత, ఆరోగ్య సమస్యలు, వాతావరణ ప్రతికూల మార్పుల ప్రభావం, నిలకడలేని ఉపాధులు, అప్పుల కుప్పల భారం, బాల కార్మిక దురాచారం, కూలీల కొరత, సాంకేతిక మార్పులు, వేతనాల అసమానతలు, ఆర్థిక సామాజిక సమస్యలు, అధ్వాన్నమైన పని పని పరిస్థితులు, మానవ హక్కుల హననాలు, అణచివేతలు, చట్ట రక్షణలో లోపాలు లాంటివి ఆ వర్గాన్ని కుంగదీస్తున్నాయి.

వ్యవసాయ కూలీల సమస్యలకు పరిష్కారాలు:
వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం, రైతులు, భూమి యజమాన్యాలు ముందుకు రావాలి. కనీస వేతన చట్టానికి అనుగుణంగా పని కల్పించాలి. కూలీలకు పని క్షేత్రంలో భద్రత కల్పించాలి. ఉచిత ఆరోగ్య వసతులు కల్పించాలి. అన్ని సీజన్లలో పని కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. కూలీల కుటుంబ పిల్లలకు ఉచిత విద్య అందించాలి. పనికి తగిన ప్రతిఫలం దక్కే విధంగా చూడాలి. పురుగు మందుల పిచికారిలో తగిన జాగ్రత్తలు పాటించే విధంగా చూడాలి. కూలీలు దుఃఖిస్తే మహాపాపం. ప్రతి ఒక్కరు వ్యవసాయ కూలీలకు తగిన గుర్తింపు ఇవ్వాలి. రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలు సంతోషంగా ఉంటేనే సరసమైన ధరలకు ఆహార పదార్థాలు మన చేతికి అందుతాయని గమనించాలి. వ్యవసాయ కార్మికుల శ్రేయస్సు మన ప్రధాన నినాదం కావాలి. అన్నదాత రోదనలు దేశానికి పెనుశాపాలు. రైతు లేని భారతం ఎడారితో సమానం. అన్నదాత/సాగుకూలీల ఆక్రందనాలు దేశాభివృద్ధికి విఘాతాలు. సాగుబడి సదుగులు ఇరిగితే అన్నం మెతుకు కొరత కేకలు మిన్నంటుతాయి. రైతు కూలీలు సుభిక్షంగా ఉంటే భరతమాత ఆనంద డోలికల్లో మునిగి తేలుతుంది. హలధారి ముఖం నవ్వులతో వికసించాలి. రైతే రాజు కావాలి. వ్యవసాయ కూలీలు మన ప్రియ నేస్తాలు కావాలి.

(31 మార్చి "జాతీయ వ్యవసాయ కార్మికుల దినోత్సవం" సందర్భంగా)

సెన్సస్ 2027లో పౌరుల భాగస్వామ్యం
దేశ ప్రగతికి మార్గదర్శకం

మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

సెన్సస్ 2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానం దేశ జనాభా గణనలో ఒక ఆధునిక, పారదర్శక మార్గంగా నిలుస్తోంది. ఈ ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ డిజిటల్ సదుపాయాల ద్వారా ప్రజలు తమ ఇళ్లలో నుంచే సురక్షితంగా, వేగంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం పొందనున్నారు.స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా వివరాలు నమోదు చేయగలగడం వల్ల ప్రజల సమయం,శ్రమ రెండూ ఆదా అవుతున్నాయి.అంతేకాకుండా, ఒకసారి నమోదు చేసిన సమాచారాన్ని అవసరమైతే సవరించుకునే సౌకర్యం ఉండటం ఈ విధానానికి మరింత విశ్వసనీయతను అందిస్తోంది. డిజిటల్ విధానంతో మానవ తప్పిదాలు కూడా గణనీయంగా తగ్గుతాయి.ఇక ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ సేవలు విస్తరించడంతో, ప్రజలు సులభంగా ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం పెరిగింది. వలస వెళ్లిన కుటుంబ సభ్యులు కూడా తమ ప్రస్తుత స్థానం నుంచే వివరాలు నమోదు చేయగలగడం ఈ విధానానికి మరో ప్రత్యేకత. ఇది సమగ్ర ఖచ్చితమైన డేటా సేకరణకు దోహదపడుతుంది.సెల్ఫ్ ఎన్యూమరేషన్ ద్వారా సేకరించబడే ఖచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి అభివృద్ధి కార్యక్రమాలను లక్ష్యబద్ధంగా అమలు చేయడంలో ఎంతో సహాయపడుతుంది. ఉదాహరణకు, ఏ ప్రాంతంలో పాఠశాలలు అవసరమో, ఎక్కడ ఆసుపత్రులు తక్కువగా ఉన్నాయో, ఎక్కడ ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందో వంటి అంశాలు స్పష్టంగా తెలుస్తాయి. దీని వల్ల నిధుల వినియోగం సమర్థవంతంగా జరిగి, అభివృద్ధి వేగవంతమవుతుంది.

ప్రజలలో అవగాహన – విజయానికి కీలకం
సెన్సస్ 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ విజయవంతం కావాలంటే ప్రజలలో సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. చాలా మందికి ఈ ప్రక్రియ గురించి పూర్తిగా తెలియకపోవడం వల్ల వారు పాల్గొనడంలో వెనుకంజ వేయవచ్చు. కాబట్టి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రచార రథాలు, సమావేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించడం అవసరం.పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడం ద్వారా మరింత మంది ప్రజలకు ఈ విధానం చేరువవుతుంది. యువత ముందుకు వచ్చి తమ కుటుంబాలతో పాటు ఇతరులకు కూడా సహాయం చేస్తే, ఈ ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుంది.అలాగే అంగన్వాడీ టీచర్స్, హెల్త్ వర్కర్స్, స్థానిక నాయకులు ప్రజలకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తే, డిజిటల్ పద్ధతిపై ఉన్న భయాలు తొలగిపోతాయి. ముఖ్యంగా వృద్ధులు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారికి సహాయం అందించడం అత్యంత అవసరం. డేటా భద్రతపై ప్రభుత్వం హామీ ప్రజలు అందించే వ్యక్తిగత సమాచారం పూర్తిగా భద్రంగా ఉండేలా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆధునిక సైబర్ భద్రతా వ్యవస్థల ద్వారా ఈ డేటాను రక్షిస్తున్నారు. ఈ సమాచారం కేవలం గణాంకాల కోసం మాత్రమే ఉపయోగించబడుతుంది కానీ, ఇతర ప్రయోజనాలకు ఉపయోగించబడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.అందువల్ల ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా నిజమైన వివరాలను నమోదు చేయాలి. తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాల అమలుపై ప్రభావం పడే అవకాశం ఉంది.సెన్సస్ 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ కేవలం ఒక వ్యక్తిగత ప్రక్రియ కాదు ఇది ఒక సామూహిక బాధ్యత.ప్రతి కుటుంబం తమ వివరాలను నమోదు చేయడంతో పాటు, తమ పరిసరాల్లో ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒకరు ముందుకు వస్తే, మరెంతో మంది సులభంగా ఈ ప్రక్రియలో భాగస్వాములు అవుతారు.సెన్సస్ 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరగడం మాత్రమే కాదు, ప్రభుత్వంపై విశ్వాసం కూడా బలపడుతుంది.సరైన సమాచారం ఆధారంగా తీసుకునే నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో వేగంగా నడిపిస్తాయి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు, జర్నలిస్టు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షలకు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

రాష్ట్రం

రూ.కోటి విలువైన యాష్ ఆయిల్ స్వాధీనం

- ఒకరి అరెస్ట్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 30: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటి) బృందం సమిష్టిగా నిర్వహించిన తనిఖీలలో భారీగా హాఆయిల్ స్వాధీనం చేసుకున్నారు . ఒరిస్సా నుండి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నదాదాపు 9.402 కిలోల యాష్ ఆయిల్ (గంజాయి ద్వారా తయారు చేసే నూనె)ను పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ. 1 కోటి రూపాయలుప. కొరాబు చాంటి బాబును అరెస్టు చేయగా, రాజారావుతో పాటు , మరో గుర్తుతెలియని వ్యక్తి పరారీలో ఉన్నారు. ఈ డ్రగ్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని గుర్తుతెలియని వ్యక్తులకు సరఫరా చేయడానికి ప్రయత్నించాడు. మార్చి 29 సాయంత్రం మహేశ్వరం గేట్ బస్ స్టాప్ వద్ద నిలబడి ఉన్న సమయంలో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 పాలిథిన్ కవర్లలో ఉన్న హాషీష్ ఆయిల్ మరియు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చంటి బాబుపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని కంచరపాలెం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలలో 4 కేసుల్లో నిందితుడు,(ఎన్ డి పి ఎస్) కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. యువత మరియు విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా, తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే మహేశ్వరం జోనల్ కంట్రోల్: 8712662664 లేదా డయల్ 100కు సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన అధికారులను పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపిఎస్ మరియు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 30: చేవెళ్ల ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు పునరుద్ధరించారు. పట్టణ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం అవుతున్నది. నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్, ఆండర్ డ్రైనేజ్. తాగునీరు పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. దీంతో పక్షం రోజులుగా డయాలసీస్ సేవలకు అంతరాయం ఏర్పడింది. చేవెళ్ల శాసన సభ్యులు కాలె యాదయ్య 63 వాట్స్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయించగా. చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్రెడ్డి విద్యుత్ కెబుల్స్, అండర్ డ్రైనేజ్. తాగునీరు పనులకు స్వతహగా రూ.50వేలతో యుద్ధప్రాతిపదికనా పనులు చేయించారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో తిరిగి డయాలసీస్ పనులు ప్రారంభమయ్యాయి. తమకు సహాకారం అందిస్తే,మున్సిపల్ పాలకవర్గంను, అధికారులను ఆసుపత్రి వైద్య విభాగం సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్. సీఐ భూపాల్ శ్రీధర్. మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాములు గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, క్రిష్ణనాయక్, తాళ్లపల్లి నర్సింలు, కందవాడ మాజీ సర్పంచ్ అరుందతి సాయిరెడ్డి ఉన్నారు.

ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు

అప్రజాస్వామిక అనైతిక చర్య

కప్పాటి పాండురంగా రెడ్డి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 30: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ నాయకులను,ఉద్యమకారులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడం ప్రభుత్వ అప్రజాస్వామిక,అనైతిక చర్య అని ఉద్యమ నాయకుడు, తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు.తెలంగాణ ఉద్యమ కారుల అసెంబ్లీ ముట్టడి పిలుపుతో సోమవారం ప్రొద్దున కందుకూరు పిస్ పోలీసులు కప్పాటి పాండురంగా రెడ్డి ని హౌస్ అరెస్టు చేసారు ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. ప్రజల గొంతుకను నొక్కడం ద్వారా పాలన సాగించాలనుకోవడం భ్రమ అని ఆయన హితవు పలికారు.హామీల విస్మరణపై ఆగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిని అరెస్టులు చేయడం ప్రభుత్వ అసమర్థతను సూచిస్తుందని విమర్శించారు.అమరవీరుల ఆత్మ బలిదానాల వల్ల, వేలాది మంది ఉద్యమకారుల పోరాటాల వల్ల సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలోనే నేడు ముఖ్యమంత్రి, మంత్రులు పదవులను అనుభవిస్తున్నారని, ఒక్క సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆయన గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏరాటు అయిన తర్వాత నాడు,నేడు ఉద్యమకారుల భుజాల మీద ఎక్కి పదవులు పొందిన వారు, అదే ఉద్యమ కారులను అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వ పెద్దలు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పాండురంగా రెడ్డి కోరారు. ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీస్తే భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

ఆశా వర్కర్ల రాస్తారోకో

ప్రతిపక్షం, చిట్యాల, మార్చి 30: నల్గొండ జిల్లా చిట్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సోమవారం చిట్యాలభువనగిరి రోడ్డు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ళే ఆశా వర్కర్ల పై సర్కారు నిర్బంధాన్ని నిరసిస్తూ.. పెద్ద ఎత్తున జరిపిన ఈ రాస్తారోకో కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయ్యన్న, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ లు హాజరై మాట్లాడారు. హైదరాబాద్ వెళ్లకుండా ఆశా వర్కర్ల ఇండ్ల వద్దకు వెళ్ళి ముందస్తు అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న ఆశా వర్కర్లకు అదనపు పనులు చెబుతూ వారిచే వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని అన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం 18వేలు అందించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్యాల, నార్కట్‌పల్లి మండల నాయకులు బొబ్బల అరుణ జ్యోతి, లక్ష్మి, నీరజ, పద్మ, వాణి, గుత్తా సరిత, వేముల అరుణ, నీలమ్మ, రేణుక, శైలజ, జయమ్మ, శోభ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో మలబార్ గోల్డ్ నూతన నగల షోరూం

- ప్రారంభించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : సంగారెడ్డి పట్టణం లో నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ షో రూం ను సోమవారం రోజు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. నిర్మలా జగ్గారెడ్డి కి స్వాగతం పలికిన షో రూమ్ నిర్వాహకులు, శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం షోరూమ్ లో నగలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి లో మలబార్ షోరూం ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్. కౌన్సిలర్ సంగీత మహేష్,నాయకులు కూన సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కంటి పరీక్షలు

- 'అరైవ్ అలైవ్-2026'లో భాగంగా దామెర పోలీసుల చొరవ

ప్రతిపక్షం ప్రతినిధి, పరకాల మార్చి 30: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు దామెర పోలీసులు సోమవారం వాహనదారులకు ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 'అరైవ్ అలైవ్2026' కార్యక్రమంలో భాగంగా పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు పరీక్షలు చేయించారు. డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దృష్టి లోపాలు ఉన్న డ్రైవర్లను గుర్తించి, వారికి ఉచితంగా మందులు మరియు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్ రావు మరియు దామెర ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కేవలం అవగాహన రాహిత్యం, అనారోగ్య సమస్యల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ప్రజలందరూ 'అరైవ్ అలైవ్ 2026'లో భాగస్వాములు కావాలని, వాహనదారులు తమ ఆరోగ్యం పట్ల, ట్రాఫిక్ నిబంధనల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

వాటర్ మెన్‌కు ఘన సన్మానం

ప్రతిపక్షం, మొయినాబాద్ , మార్చి 30 : మండలంలోని ఖాసీంబౌలి గ్రామంలో తాగునీటి సరఫరాలో విశేష సేవలందిస్తున్న వాటర్ మెన్ యాదగిరిని సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. మిషన్ భగీరథ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో యాదగిరి అంకితభావాన్ని సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ రాజేష్, డిప్యూటీ ఈఈ హారిక, ఏఈఈ వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 30: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభలు, వార్డు , మున్సిపల్ సభల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలను పండుగ వాతావరణంలో నిర్వహించడంతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణపై నివేదికలను సిద్ధం చేసి గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని, ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు తదితర వివరాలను గ్రామ సభల సందర్భంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు ₹500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ₹500 సిలిండర్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను కరదీపికల రూపంలో తయారు చేసి సభకు వచ్చే ప్రతి ఒక్కరికి అందజేయాలని, అలాగే అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, గ్రామ సభలకు ప్రజలు అధికంగా హాజరయ్యేలా రెండు రోజుల ముందుగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు టెంట్లు, షామియానాలు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మినిట్ టు మినిట్ కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ఏర్పాట్లపై ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- కామారెడ్డి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 30: అఘాయిత్యాలకు ఒడిగట్టే నేరస్తులు ఎంతటి వారైనా చట్టం నుండి తప్పించుకోలేరని ఈ తీర్పు నిరూపించింది. బాధితులకు అండగా ఉండి, సత్వర న్యాయం అందించడమే మా ప్రథమ కర్తవ్యం అని జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర తెలిపారు. కేసు వివరాలు అయన తెలియజేశారు. ఫిర్యాదురాలు గత ఏడాది ఫిబ్రవరి 25న కూతురు, కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిలో నిద్రించారు. మరుసటి రోజు తేదీ 26న ఉదయం సుమారు 4:00 గంటలకు లేచి చూడగా, తన కూతురు ఇంటిలో కనిపించలేదు. వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువులు తెలిసిన వారి వద్ద వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. అనంతరం ఫిర్యాదురాలు ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గండి మాసానిపేట గ్రామానికి చెందిన చెర్ల ప్రశాంత్ (24 సం., తండ్రి: కాంతయ్య) అనే వ్యక్తి, బాధితురాలికి బంధువు. కుటుంబ సమస్యల వల్ల తన భార్యతో వేరుగా జీవిస్తున్న అతడు, తన స్వార్థ ప్రయోజనాల కోసం 10వ తరగతి చదువుతున్న అమాయక బాలికను లక్ష్యంగా చేసుకున్నాడు. పరిచయం పెంచుకుంటూ, ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, "నిన్ను పెళ్లి చేసుకుంటాను" అని నమ్మబలికాడు. అతని మాటలను నమ్మిన ఆ బాలిక, తనకేం జరుగుతుందో అర్థం చేసుకోలేని వయసులో ఉండటంతో అతని వలలో పడిపోయింది. ఇదే అవకాశంగా తీసుకున్న నిందితుడు, పలుమార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగని నిందితుడు, ముందస్తు ప్రణాళికతో బాధితురాలిని పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఫోన్ ద్వారా సంప్రదించి, 26022025 తెల్లవారుజామున సుమారు 5:00 గంటల సమయంలో ఇంటి బయటకు రావాలని చెప్పాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు బయటకు రాగానే, ఆమెను తనతో పాటు హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ కొంతకాలం వివిధ ప్రదేశాల్లో ఉంటూ, తన వికృత చర్యలను కొనసాగించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, చివరకు హైదరాబాద్‌లో బాధితురాలిని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాధితురాలు వాంగ్మూలం ఆధారంగా నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలను విచారించి నిందితుడు చెర్ల ప్రశాంత్, 24 సం: (తండ్రి: కాంతయ్య, గండి మాసానిపేట గ్రామం)ను అరెస్ట్ చేశారు. అనంతరం అన్ని రకాల సాక్ష్యాధారాలు సేకరించి పోక్సో చట్టం కింద కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలను పరిశీలించిన జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు (రేప్ & పోక్సో కేసుల విచారణ కోర్టు జిల్లా న్యాయమూర్తి డా. వరప్రసాద్ కేసు రుజువు అయిందని తేల్చి, నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 15,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు, బలమైన సాక్ష్యాల సమర్పణతో సమర్థంగా విచారణ చేసిన అప్పటి డీఎస్పీలు ఏ. శ్రీనివాసులు, ఎస్. శ్రీనివాస్ రావు (ప్రస్తుత), పోలీసు తరఫున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషు, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత ఎస్‌హెచ్ఓ మహేష్, సీఐ డి. రాజా రెడ్డి, డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ యస్. సాయిలును జిల్లా ఎస్పీ అభినందించారు.

ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 30 : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓ ప్రతినిధులు కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

"

డ్రగ్స్ కేసులో నాపై వచ్చిన ఆరోపణలు మానసికంగా కలచివేశాయి. ఆ సమయంలో చనిపోవాలనిపించింది. మానసికంగా కుంగిపోయా. నేను ఎలాంటి తప్పు చేయలేదు. అందుకే చివరికి నిర్దోషిగా బయటికి వచ్చా. మీడియాలో వచ్చిన కొన్ని వార్తల వల్ల నా కుటుంబం చాలా సఫర్ అయింది.

- మీట్ ది ప్రెస్‌లో నటి హేమ

ప్రాంతీయం

కళాకారులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలి

- ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఎన్నిక
- సంగారెడ్డి జిల్లా పీఎన్ఎం ప్రధాన కార్యదర్శి ఎ. నాగభూషణం.

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. రాజు, ఎ.నాగభూషణం డిమాండ్ చేశారు. సోమవారం రోజు సంగారెడ్డిలోని పీఎస్ఎం జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి జిల్లా మూడవ మహాసభలను జయప్రదంగా నిర్వహించడం జరిగిందన్నారు. మహాసభలకు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నూతన కమిటీని 15 మందితో ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మహాసభల్లో పలు తీర్మాణాలు చేయడం జరిగిందని, ముఖ్యంగా కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అదే విధంగా కళాకారులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, వృత్తి కళాకారులకు వాయిద్య పనిముట్లు ప్రభుత్వం ఉచితంగా అందించాలన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఉచిత బస్సు, రైలు సౌకర్యం కల్పించాలన్నారు. అదె కళాకారులకు బ్యాంకులోన్లు ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో శిక్షణ కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలని, ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరారు. అదే విధంగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని తీర్మాణం చేయడం జరిగిందన్నారు. కళాకారులకు కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్ల బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను రద్దు చేయాలని, లేబర్ కోడ్లు, నూతన విద్యుత్ చట్టం, విత్తన చట్టాలను రద్దు చేయాలన్నారు. ప్రజానాట్యమండలి నూతన జిల్లా కమిటీ ఎన్నిక. ప్రజానాట్యమండలి సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన పీఎన్ఎం జిల్లా మూడవ మహాసభలో పలు తీర్మాణాలను ఆమోదించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎ. నాగభూషణం, ఉపాధ్యక్షులుగా పి. ఆంజనేయులు, ఎస్.ఉదయ్, శ్రీలత, సహాయ కార్యదర్శులుగా ఎం.కృష్ణ, వై.రాజు, వి. యేసు, అపురూఫ్, కమిటీ సభ్యులుగా డి. ప్రభు, ఎం.అంజయ్య, బి.సత్యనారాయణ, ఎ.యాదయ్య, ఎం.పద్మ, పి.ప్రవీణలను ఎన్నుకున్నారు.

వరంగల్‌లో కేంద్ర ఉన్నత విద్యాసంస్థల ఆవశ్యకత

- లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 30: వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డా కడియం కావ్య తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా వరంగల్ పార్లమెంటరీనియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉన్నత విద్యాసంస్థలు పరిమితంగా ఉండటంపై లోక్‌సభలో ఆందోళన వ్యక్తం చేశారు సోమవారం పార్లమెంట్ లో ప్రశ్నోత్తర సమయంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రాష్ట్రంలో ఉన్న కేంద్ర ఉన్నత విద్యాసంస్థల సంఖ్య, వరంగల్‌లో వాటి స్థితి, 202325 కాలానికి మౌలిక వసతులు, పరిశోధన గ్రాంట్లు డిజిటల్ లెర్నింగ్‌కు కేటాయించిన నిధుల వివరాలు కోరారు. అలాగే ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (GER), నియోజకవర్గ స్థాయిలో విద్యార్థుల నమోదు గణాంకాలు, కేంద్ర పథకాల కింద స్కాలర్‌షిప్ లబ్ధిదారుల వివరాలు, పరిశోధన నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుకు కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగారు ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానంలో తెలంగాణలో కేవలం 9 కేంద్ర ఉన్నత విద్యాసంస్థలు మాత్రమే ఉన్నాయని, వరంగల్ నియోజకవర్గంలో ఒక్క న్ ఐ టీ మాత్రమే ఉందని వెల్లడించారు అయితే రాష్ట్రంలో 35 కేంద్ర విద్యాలయాల్లో వరంగల్‌కు ఒకటే కేటాయించడం కూడా కేంద్ర వైఖరిని స్పష్టంగా చూపుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణలో ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి (GER) దేశ సగటు కంటే ఎక్కువ ఉన్నప్పటికీ, కేంద్రం నుంచి తగిన మౌలిక వసతులు సంస్థలు అందకపోవడం రాష్ట్ర యువతకు నష్టం కలిగిస్తోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు వరంగల్‌లో 1.65 లక్షలకుపైగా విద్యార్థులు ఉన్నప్పటికీ, కేంద్ర స్థాయి విద్యాసంస్థల విస్తరణ జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు. న్ ఐ టీ వరంగల్‌కు కేటాయించిన రూ. 64.38 కోట్ల నిధులు సరిపోవనికొత్త కేంద్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డిమాండ్ చేశారు కేంద్రం ప్రకటిస్తున్న పథకాలు కాగితాలపైనే మిగిలిపోకుండా, తెలంగాణలో భౌతికంగా సంస్థల రూపంలో కనిపించాలన్నారు. వరంగల్ వంటి అర్బన్‌రూరల్ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్రం తక్షణ చర్యలు తీసుకుని, విద్యా రంగంలో సమానత్వాన్ని పాటించాలని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.

భూగర్భ జలాలపై అవగాహన సదస్సు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో సోమవారం వెలిమెల గ్రామం, రామచంద్రపురం మండలం, సంగారెడ్డి జిల్లాలో ప్రపంచ నీటి సదస్సు నిర్వహించి, భూగర్భ జలాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ డి వైద్యనాథ్, సహాయ సంచాలకులు వ్యవసాయ శాఖ మరియు మల్లేపల్లి బుచ్చిరెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ లు మాట్లాడుతూ నీటి వృధాను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం విరివిగా చేపట్టాలని, తద్వారా భూగర్భ జలాల సంరక్షణకు వీలవుతుందని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రామచంద్రపురం మండల్, ఏవిజికే ప్రసాద్ మాట్లాడుతూ నీరే జీవనాధారం అని, "సేవ్ వాటర్‌సేవ్ లైఫ్" అని నినాదం ఇచ్చి, అందరి చేత చెప్పించారు. సభాధ్యక్షులు జిల్లా భూగర్భజలశాఖ అధికారి డా"జి.మోహన్ మాట్లాడుతూ యునెస్కో సంస్థవారు నీటి ప్రాముఖ్యతను తెలపడానికి 1993వ సంవత్సరంలో మార్చి 22వరోజును ప్రపంచ నీటి దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా వ్యవసాయ రంగం భూగర్భ జలాలపై ఆధారపడి ఉందని, ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు రైతులు పొలాల్లో వర్షపు నీరును ఒడిసి పట్టడానికి, నీటి కుంటల నిర్మాణాలను చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రధానంగా భూగర్భజలాల అదనపు వినియోగం మరియు వృధాను నియంత్రించడానికి, ఆరుతడి పంటలను ఎంచుకొని బిందు సేద్యం పద్ధతులను పాటించాలని తెలిపారు. బోర్ వెల్ పాయింట్ కోసం రైతులు కొబ్బరికాయ పద్ధతులు అనుసరించకూడదని, రైతులు భూగర్భ జల శాఖను సంప్రదిస్తే బోర్ వెల్ పాయింట్ కోసం శాస్త్రీయంగా సర్వే చేసి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అవగాహన కార్యక్రమాలతో రైతులకు, ముఖ్యంగా మహిళలకు భూగర్భజల సంరక్షణ పద్ధతులు, నీటి పొదుపు వివరాలను తెలియ చెప్పాలనేదే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు మరియు వివిధ పరిశ్రమల యజమానుల చేత జిల్లా భూగర్భ జల అధికారి డా"జి. మోహన్ నీటి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

గద్దర్ వేషధారణలో ఎమ్మెల్యే అదుర్స్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 30 : ఫస్ట్ ఎడిషన్ అఫ్ తెలంగాణ లెగిసాలేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ 2026 కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ కోసం తన జీవితం అంకితం చేసి తన గాత్రంతో లక్షలాది మందిని ఉద్యమ పంథాలో నడిపించిన మహానుభావుడు గద్దర్ గారి వేషంలో ప్రజల ముందుకు రావడం తన రాజకీయ జీవితంలో ఒక గౌరవప్రదమైన క్షణంగా భావిస్తున్నానని వర్ధన్న పేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గద్దర్ ఆలోచనలు, ఆశయాలు కేవలం చరిత్రలోనే కాకుండా ప్రస్తుత రాజకీయాలలో కూడా ప్రతిబింబించాలన్నారు. ఆయన చూపిన మార్గం ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడాలని మనకు స్ఫూర్తినిస్తుంది అని, ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, తెలంగాణ అభివృద్ధి కోసం నా కట్టుబాటు ఎప్పటికీ అచంచలంగా కొనసాగుతుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ప్రజావాణికి 50 ఆర్జీలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రజావాణి దరఖాస్తలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి,పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఆర్జికి ప్రాధాన్యత నిచ్చి సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతి, వ్యవసాయ, మహిళా శిశు సంక్షేమం, బీసీ అభివృద్ధి శాఖలు, నీటి పారుదల, ట్రాన్స్పోర్ట్, అనిమల్ హస్బెండ్రి, మున్సిపాలిటీలు, ఉపాధి తదితర శాఖలకు సంబంధించి 50 ఆర్జీలు అందాయి.

ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అమలులో నిర్లక్ష్యం

- అర్హులైన కుటుంబాలకు సహాయం అందడం లేదు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : సంగారెడ్డి జిల్లాలో నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ అమలు పరిస్థితి తీవ్రంగా నిరాశ కలిగిస్తున్నదని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు బి. కొండల్ రెడ్డి, రైతు స్వరాజ్య వేదిక సంగారెడ్డి జిల్లా నాయకురాలు ఆర్. లక్ష్మి, దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ నుంచి చుక్కమ్మ, మొగులమ్మ, సూర్యకళ తెలిపారు. కుటుంబంలో ప్రధాన ఆర్జనదారుడు మరణించినప్పుడు ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఈ కీలక పథకం సంగారెడ్డి జిల్లాలో సరైన విధంగా అమలు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లభ్యమైన సమాచారం ప్రకారం సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు కేవలం 15 మంది లబ్ధిదారులకు మాత్రమే ఎన్ ఎఫ్ బి ఎస్ కింద సహాయం అందింది. ఈ సంఖ్య చాలా తక్కువగా ఉండి, అమలు విధానంపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 14,000 మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందగా, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సమాచారం ప్రకారం ప్రతి జిల్లాలో సుమారు 1,000 అర్హ కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం అందించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సంగారెడ్డి జిల్లాలో ఇంత తక్కువ సంఖ్యలో లబ్ధిదారులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు అందజేయడం, ప్రత్యక్షంగా కలుసుకుని ఫాలోఅప్ చేయడం జరిగినప్పటికీ, ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో ప్రయత్నాలు చేసినప్పటికీ, ఎటువంటి గణనీయమైన పురోగతి కనిపించలేదని తెలిపారు. ఇటీవల ఈ సమస్య మీడియా దృష్టికి కూడా రావడం గమనార్హం. అర్హులైన కుటుంబాలు ఈ పథకం ద్వారా అందాల్సిన సహాయం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు తమ ఆర్జనదారులను కోల్పోయి తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి.ఈ నేపథ్యంలో జిల్లా పరిపాలన తక్షణమే స్పందించి, అర్హులైన కుటుంబాలను గుర్తించి ఎన్ ఎఫ్ బి ఎస్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సామాజిక న్యాయం మరియు సంక్షేమానికి కట్టుబడి ఉన్న నేపథ్యంలో, ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా

ఆశా వర్కర్ల నల్ల బ్యాడ్జీల ప్రదర్శన

ప్రతిపక్షం,పరకాల, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ధ్వజమెత్తుతూ, బీఆర్‌టీయూ అనుబంధ ఆశా యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పరకాలలో ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. గత 25 నెలలుగా తమ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందారి మంజుల మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించడం అన్యాయమని అన్నారు. ఈనెల 28న పిలుపునిచ్చిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి అనుమతి నిరాకరించి, అర్ధరాత్రి వేళ ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసనలను అణచివేయడం సరికాదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ ప్రేమలతతో పాటు పరకాల, నడికూడ మండలాలకు చెందిన సుమారు 74 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పిహెచ్‌సి అధ్యక్షురాలు పి. సునీత, రమాదేవి, లావణ్య, శైలజ, అనిత, స్వప్న, విజయ తదితరులు ఈ నిరసనలో భాగస్వాములయ్యారు.

అవగాహనతో డిజిటల్ మోసాలను నివారించండి

- గీతం విద్యార్థులకు సైబర్ నిపుణుల సూచన
- సైబర్ అవగాహనపై చైతన్యపరచేలా శిక్షణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : సైబర్ నేరాలను నివారించడానికి అవసరమైన జ్ఞానాన్ని సమకూర్చుకుని, అవగాహనతో డిజిటల్ మోసాలని అధిగమించాలని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు సైబర్ నిపుణులు సూచించారు. సైబర్ భద్రతపై మరింత అవగాహనను సమాజంలో వ్యాప్తిచేయగల బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా ఎదగాలని అభిలషించారు. గీతంలోని సైబర్ స్పేసుపై అవగాహన, బాధ్యతాయుతమైన కార్యక్రమం (స్పార్క్ క్లబ్) విద్యార్థుల కోసం 'సైబర్ అవగాహన, చైతన్య సదస్సు'ను సోమవారం నిర్వహించారు. దీనిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, న్యూఢిల్లీకి చెందిన ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్), సైబరాబాదుకు చెందిన సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ స్వల్ప వ్యవధి శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎస్.వి.హరికృష్ణ, సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సీఎస్సీకి చెందిన రష్మి శ్రీవాస్తవ, ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్)కు చెందిన శాలిని రాథోర్, శిఖర్ ద్వివేది వంటి నిపుణులు పాల్గొని, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటంపై ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, ఆసక్తికరమైన, ప్రయోగాత్మక శిక్షణా కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. బాధ్యతాయుతమైన ఆన్ లైన్ ప్రవర్తనను నిపుణులు ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఎలాంటి హానికరమైన లేదా అనైతిక డిజిటల్ కార్యకలాపాలను ప్రోత్సహించవద్దని, ఒకవేళ ఏదైనా ఆన్ లైన్ మోసం జరిగిన వెంటనే సైబర్ నేరాల జాతీయ హెల్ప్ లైన్ 1930లో కానీ, లేదా cybercrime.gov.in ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సైబర్ పరిశుభ్రతపై అవగాహన, పాస్ వర్డ్ నిర్వహణ, ప్రామాణీకరణ ఉత్తమ పద్ధతులు, ఈమెయిల్, మెసేజింగ్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల సురక్షిత వినియోగం వంటి కీలక అంశాలను స్పృజిస్తూ, 'సైబర్ హైజీన్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్'ను నిర్వహించారు. స్పార్క్ క్లబ్ ద్వారా తమ సమాజాలలో సైబర్ అవగాహనను వ్యాప్తిచేయడంలో చురుకుగా పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించారు. పరిశ్రమ నిపుణుల నుంచి నేరుగా నేర్చుకునే ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గీతం కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రజోపయోగం కోసం ఉమ్మడి కార్యక్రమాలకు గల మార్గాలను అన్వేషించడానికి గీతం సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ లను సందర్శించాలని నిపుణులను సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా ఆహ్వానించారు. ఈ కార్యశాలను కృత్రిమ మేధస్సుడేటా సైన్స్ (ఏఐ&డీఎస్) విభాగాధిపతి డాక్టర్ వి.శిరీష నిర్వహించగా, అదే విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శశివర్ధన్ సమన్వయం చేశారు.

పోలీసు కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎస్పీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 : సంగారెడ్డి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ పక్కన నూతన సంగారెడ్డి ఉపవిభాగ పోలీసు కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా సంగారెడ్డి ఉపవిభాగ పోలీసు నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉండటంతో పాటు ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ అవుతాయని అన్నారు. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, డీసీఆర్బీ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్స్ రమేష్, రాము నాయుడు, రామకృష్ణ రెడ్డి, కిరణ్ కుమార్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, అనిల్, సబ్ డివిజినల్ పోలీసు అధికారులు, డిఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రంలో పేదలకు ఇప్పటి వరకు 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చాం. డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టినా ఫ్లాట్లను కేటాయించలేదు. వారికి రూ.174 కోట్లను తిరిగి చెల్లిస్తాం. ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఇవ్వడమే మా లక్ష్యం.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

పరకాల కాంగ్రెస్‌లో ముసలం

- మండల అధ్యక్షుడిపై తిరుగుబాటు..?
- కొత్త అధ్యక్షుడి ఎన్నిక కోసం అభిప్రాయ సేకరణ...!?

ప్రతిపక్షం, పరకాల, మార్చి 30 : పరకాల కాంగ్రెస్ పార్టీలో ముసలం పీక్ స్టేజీకి చేరుకుంది. అంతర్గత విభేదాలు భయటపడుతున్నాయి. పలు గ్రామాల కమిటీల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచ్ లు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షుడి పనితీరుపై అసంతృప్తి తో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మండల అధ్యక్షుడిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు, మండల అధ్యక్షుడి తీరు వల్ల పార్టీ క్యాడర్‌లో నైరాశ్యం నెలకొందని, అసలైన కార్యకర్తలకు గుర్తింపు లభించడం లేదని ఆరోపిస్తూ ఒక వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ బలోపేతానికి కృషి చేసే వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించాలని, ప్రస్తుత అధ్యక్షుడిని వెంటనే తప్పించాలని వారు కోరినట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి.

మండల అధ్యక్షుడి ఒంటెద్దు పోకడే సంతృప్తికి కారణమా..?
ఈ అసంతృప్తికి అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలే కారణంగా పలువురు భావిస్తున్నారు. ఆయన వ్యవహారశైలి పరకాలలో పార్టీ ఎదుగుదలకు అడ్డంకిగా మారుతుందని ఆపార్టీ సీనియర్ నాయకులు భావించడం అందుకనుగుణంగానే అధ్యక్షుడి పనితీరు ఉండటం గమనార్హం. పార్టీలో సీనియర్ నాయకులను, ఎదుగొస్తున్న కార్యకర్తలను, సర్పంచ్ లను, గ్రామాలు అధ్యక్షులను సమన్వయం చేయడంలో పెద్దన్న పాత్ర పోషించాల్సిన మండల అధ్యక్షుడు విఫలమవుతున్నారని పార్టీలో ఇప్పటికే పలువురు పెదవివిరుస్తుండటం బహిరంగ రహస్యమే. అంతా తానే అనే విధంగా ఎవరినీ లెక్కచేయనితనం కూడా ఈ అసంతృప్తికి దారితీసినట్లు చర్చలు సాగుతున్నాయి. ఇక సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్ లను, పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలను కాదని తన సొంత సైన్యాన్ని పెంచి పోషిస్తూ ఐక్యతకు విఘాతం కలిగించేలా తన పని తీరు ఉండటం కూడా అతనిపట్ల మరింత అసంతృప్తి పెరుగేందుకు కారణంగా పలువురు భావిస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడనే అతి విశ్వాసంతో ముందుకు సాగుతున్న అధ్యక్షుడికి ఎమ్మెల్యే అండగా నిలుస్తే పార్టీలోని అసంతృప్తి రోడ్డునపడే అవకాశం ఖాయంగా కనిపిస్తోంది. నూతనంగా ఎన్నుకోవాల్సి ఉన్న మండల కమిటీని యధావిధిగా కొనసాగించే ప్రయత్నం చేసినట్లైతే ఓటింగ్ కు కూడా పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్న తరుణంలో సొంత పార్టీలోనే ఈ స్థాయిలో అసమ్మతి వ్యక్తమవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ 'ముసలం' ఎటు దారితీస్తుందోనని స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 30: సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షిపూర్ చౌరస్తాలో సిఐటి యు ఆధ్వర్యంలో సోమవారం రహదారిపై ఆశా వర్కర్లు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ టి యు జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆశ వర్కర్లకు ఎన్నికలముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇచ్చిన హామీలు అమలు చేయకపోవ డా న్ని నిరసిస్తూ మార్చి 28న ఇందిరపార్క్ వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తామని ప్రభుత్వాన్ని అనుమతి కోరితే , ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా సి ఐ టి యు నాయకులను ,ఆశావర్కర్లు ను పోలీస్ లతో అక్రమంగా అరెస్టులు చేయించి నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ రహదారి పై రహదారి పై రాస్తా రోకో నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కారం చేయకపోతే వర్షాకాలంలో నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సిహెచ్ భాగ్యలక్ష్మి, నాయకులు మద్దెల అంజయ్య,ఎం డి సాజిద్ ,ఆశ వర్కర్లు సంతోషి, శ్యామల ,లత, సుమలత ,చంద్రకళ ,శారద ,కవిత ,మాలతి ,బాలమణి ,అరుణ, లక్ష్మి ,రమణ ,సుజాత, పుష్పలత, సాజిద,శారద, షహీన్ సుల్తాన, బాలమణి,లక్ష్మి,లావణ్య,రేణుక, మాదవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కుచన్‌పల్లి విద్యార్థుల సత్తా

- 12 బంగారు, 6 వెండి పతకాలతో మెరుపు ప్రదర్శన

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చి30: రెంజుకీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలోని జీకేఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పీఎం శ్రీ కుచన్‌పల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతూ బంగారు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుమోహన్ తెలిపారు. పాఠశాలలో గత మూడు నెలలుగా ఆత్మరక్షణలో భాగంగా కరాటే మాస్టర్ నాగేందర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 800 మంది బాలబాలికలు పాల్గొన్నారు. హవేలీ ఘన్పూర్ మండలంలోని పీఎం శ్రీ కుచన్‌పల్లి పాఠశాలకు చెందిన బాలికలు మవ్యశ్రీ, అభినయ,బృహతి,నందిని, సాత్విక, రేవతి, మాధవి, సహస్ర, భార్గవి, రిషిత, అలేఖ్య, నిత్యశ్రీ, దివ్య, హాసిని, నివేదిత, సంధ్యలు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో అవినాష్, మోహిత్, వర్షిత్ పాల్గొన్నారు. మొత్తంగా ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 12 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు సాధించి కుచన్‌పల్లి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ విజయానికి తోడ్పడిన కరాటే మాస్టర్ నాగేందర్‌ను, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.పతకాలతో పాటు సర్టిఫికెట్లను రెంజుకీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్, పీడీ వినోద్ కుమార్, సీనియర్ టీచర్ శివరాజ్ విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 30: సిద్దిపేట మున్సిపాలిటీ నర్సాపూర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఇటీవల మరణించిన రచం రాజు (చంటి) కుటుంబానికి ఎర్రబోలు రాజారెడ్డి ఆర్థిక సహాయం అందించారు. కాలనీవాసుల సమాచారం మేరకు వెంటనే స్పందించిన ఆయన, ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు తక్షణ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బందారి కనకరాజు, బెల్లే మల్లేష్, తాళ్ల రాజశేఖర్, ఉస్మాన్ ఖాన్, తరిగొప్పుల వెంకటేష్, మారుపక మహేష్, కర్రోళ్ల ప్రశాంత్, స్వామి యాదగిరి, మహేష్, షారుక్ ఖాన్, గురుమూత్ సింగ్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరగనున్న వీర హనుమాన్ విజయోత్సవ శోభ యాత్రకు బీజేపీ రాష్ట్ర నాయకులు మాదడి జశ్వంత్ రెడ్డి 30 వేల రూపాయలు అందించారు. విజయయాత్ర విజయవంతం కావాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతిపక్షం, గజ్వేల్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

- గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్) మార్చ్ 30: రోడ్డు ప్రమాదాలు, జరగకుండా ఉండేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం గౌరారం శివారులోని కావేరి విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన సందర్భంగా గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రోజురోజుకు చోటుచేసుకుంటున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. జీవితం ఎంతో విలువైనదని, బాధ్యతాయుత పౌరస్త్వాన్ని, స్థిరమైన నగర రవాణాను ప్రోత్సహించే విశ్వవిద్యాలయ పట్టుదలను గుర్తించాలని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం, స్పీడ్ లిమిట్లు, పాదచారుల భద్రత, డ్రైవింగ్ నివారణ వంటి కీలక అంశాలపై వారికి అవగాహన పెంచారు. కాగా 300 మందికి పైగా విద్యార్థుల చే ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హర్ష పోల్సాని, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, డీన్స్ డాక్టర్ కొండా శ్రీనివాస్, డాక్టర్ ప్రతాప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాములు కొండగట్టు పాదయాత్ర

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 30: చేగుంట మండలంలోని పెద్ద శివనూర్ గోపాలపురం గ్రామాల చెందిన హనుమాన్ స్వాములు మాజీ ప్రజాప్రతినిధులు కొండగట్టు పాదయాత్ర చేపట్టారు . గోపాలపురం నాగదేవత ఆలయం సమీపంలోని హనుమాన్ ఆలయం నుండి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మున్నూరు రామచంద్రం గురుస్వామి మున్నూరు భరత్ పెద్ద శివనగర్ గోపాలపురం హనుమాన్ భక్తులు పాదయాత్ర లో తరలి వెళ్లారు. హనుమాన్ స్వాముల పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది

- టీపీటీఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 30: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని, పవిత్రమైన వృత్తి అని ఈ వృత్తిలోకి వచ్చిన ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా సమాజంలో జరిగే అసమానతలు, దౌర్జన్యాలు దోపిడికి వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత ఉందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వింజపురి వేణు పదవీ విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. సమాజంలో ఇంకా అసమానతలు పెరిగిపోతున్నాయని, బలహీనుల పైన దాడులు జరుగుతున్నాయని, పాఠశాల వ్యవస్థలో అనేక రకాలైన రుగ్మతలు ఉండడం మూలంగా విద్య అందరికీ అందుబాటులో లేకుండా అయిందన్నారు .అందుకే సామాజిక బాధ్యత గల ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల భవిష్యత్తు కోసం తపించేవారుగా ఉంటేనే భవిష్యత్తు బాగుపడుతుందని అన్నారు .అలాంటి కోవలోకే ఉపాధ్యాయుడు వేణు వస్తాడని అన్నారు.వారు తెలంగాణ ఉద్యమానికి, టిపిటిఎఫ్ ఉద్యమానికి సేవలు అందించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇంకా సమాజ మార్పుకోసం పని చేయాల్సిందిగా కోరారు .అనంతరం అతనికి పాఠశాల ఉపాధ్యాయుల పక్షాన, బంధువులు ,స్నేహితుల మధ్యలో సన్మాన కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంటయ్య ఉపాధ్యాయ బృందం గోపాల్ రెడ్డి, మల్లారెడ్డి ,జైపాల్ రెడ్డి, రవి ,స్థానిక సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ , టి పి టి ఎఫ్ నాయకులు ఎస్ నరేందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ,ఎస్ కనకయ్య, రాష్ట్ర కౌన్సిలర్స్ జానకి రాములు ,ఎండి జమీర్,తిరుపతి రిటైర్ సంఘ ఉపాధ్యాయులు పోనమల రాములు స్వర్గం రాములు ,వేణు సార్ బంధువులు, ఆత్మీయులు పాఠశాల పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రచయిత టేకులపల్లి గోపాల్ రెడ్డి జీవితం స్ఫూర్తి దాయకం

- మరసం నివాళి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 30: సిద్దిపేట డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్, రచయిత టేకులపల్లి గోపాల్ రెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకం అని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. ఇటీవల మృతి చెందిన రచయిత, సామాజిక చింతనాపరుడు టేకులపల్లి గోపాల్ రెడ్డి స్మృతి సభ సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సోమవారం మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది.. సమావేశం లో TJAC చైర్మన్, సిద్దిపేట డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి. పాపయ్య, ప్రముఖ రచయిత కె. అంజయ్య, TPTF రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి. తిరుతిరెడ్డి, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, మరసం పూర్వ అధ్యక్షులు తోట అశోక్, గజ్వేల్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య, ప్రధాన కార్యదర్శి గంభీర్రావు పేట యాదగిరి, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులువ నందిని భగవాన్ రెడ్డి, వేణు, మహేందర్ తదితరులు పాల్గొని మాట్లాడారు..గోపాల్ రెడ్డి బాల్యంనుండి మొదలుకొని చివరి దశవరకు ఎన్నో సవాళ్ళను, ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడ్డ గొప్ప వ్యక్తి అని అభిప్రాయ పడ్డారు.. చిన్నతనంలో జరిగిన ఒక ప్రమాదం వల్ల సరైన వైద్యం అందక చూపు కోల్పోయిన గోపాల్ రెడ్డి బ్రెయిలీ లిపిలో పట్టుదలతో ఉన్నత విద్యను పూర్తి చేసి జూనియర్ కళాశాల లెక్చరర్ గా,డిగ్రీ కళాశాల లెక్చరర్ గా పనిచేసి ఎంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన అధ్యాపకుడని తెలిపారు.. మాటతోనే మనిషిని గుర్తుపట్టే గొప్ప జ్ఞానం కలిగిన గోపాల్ రెడ్డి అని తెలిపారు.. ఆయన సిద్దిపేట లో పనిచేసిన కాలం లో.. మెదక్ వెళ్లిన తరువాత కూడా మంజీరా రచయితల సంఘం తో సుమారు 40 సంవత్సరాలు కలిసి నడిచిన గొప్ప మానవతా వాది, సామాజిక చింతనా పరుడు గోపాల్ రెడ్డి అని అన్నారు. ఉద్యోగ విరమణ తరువాత మెదక్ సమీపంలో తన స్వగ్రామం లో స్థిరపడ్డ గోపాల్ రెడ్డి తన జీవిత చరిత్ర నే ప్రధాన అంశం గా " జీవన స్రవంతి " అనే గొప్ప నవలను రాశాడని అన్నారు. మూడు బాగాలుగా రాసిన ఆ నవల రెండు భాగాలు ఆవిష్కరణ అయ్యాయని మరో భాగం రచన పూర్తి అయ్యి ఆవిష్కరణ కు సిద్ధం అయ్యిందని అలాంటి తరుణంలో ఆయన మరణించడం బాధాకరమని అన్నారు.. ఆయన రాసిన " జీవన స్రవంతి " నవల సాహిత్య ప్రపంచం లో గొప్ప రచనగా నిలిచిపోయిందని.. ఆనవల కేవలం వ్యక్తిగత జీవిత చరిత్ర మాత్రమే కాదని ఒక 50 ఏండ్ల సామాజిక పరిణామాలను ఆనవలలో నిక్షిప్తం చేశాడని తెలిపారు.. ప్రపంచ సాహిత్యం లో అంధులు రాసిన సాహిత్యం చాలా తక్కువ అని అందులో గోపాల్రెడ్డి సార్ రాసిన నవల ఒకటని అభిప్రాయ పడ్డారు.. తన మనో నేత్రం తో సమాజాన్ని చదివి సాహిత్యం అందించిన గొప్ప ప్రేమ మూర్తి గోపాల్ రెడ్డి అని ఆయన మరణం సమాజానికి, సాహిత్యనికి తీరని లోటు అని మంజీరా రచయితల సంఘం అభిప్రాయ పడింది.

నీట మునిగి విద్యార్థుల మృతి తీవ్ర బాధాకరం

- మృతుల కుటుంబాలకు మనోధర్యం కల్పించిన ప్రతాప్

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 30: గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన కుక్కల యాదగిరి గారి కొడుకు మనీష్ (12). నవీన్ కుమార్ కూతురు రుషిక (13) ఆదివారం సాయంత్రం మల్లన్న సాగర్ కెనాల్ లో ప్రమాదవశాత్తు పడి నీటిలో మునిగి ఇద్దరు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు విద్యార్థులు మనీష్ 7 తరగతి, మరియు రిషిక 8వ తరగతి చదువుతున్నారు ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో కొడకండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను గజ్వేల్ గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ ధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు. ఇలాంటి దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని విచారాన్ని వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తమ పిల్లలను చెరువుల వద్దకు, కెనాల్ వద్దకు తమ వెంట తీసుకపోవద్దని పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుని, చమురును తీసుకుంటాం. పలు మిలిటరీ ఆపరేషన్స్‌ను పరిశీలిస్తున్నాం. ఖర్గ్ ఐలాండ్‌ను మేం స్వాధీనం చేసుకోవచ్చు, చేసుకోకపోవచ్చు. మాకు చాలా ఆప్షన్స్ ఉన్నాయి. కొన్నేళ్లు మా అధీనంలో ఉంచుకోవచ్చు. తమను అడ్డుకునేందుకు ఇరాన్ దగ్గర ఏమీ లేదు.
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రాంతీయం

మార్కెట్ కమిటీ డైరెక్టర్ల
నియామకంలో అన్యాయం

- **నియోజకవర్గ ఇంఛార్జి దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు**

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 30: మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరిగిందంటూ నిరసన వ్యక్తం చేస్తూ నంగునూరులో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంఛార్జి పూజల హరికృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ కోసం పనిచేసిన తమకు అన్యాయం చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు తప్పెట శంకర్, నంగున గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి నియంత పోకడలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ, నాటి అధికార పార్టీ పెట్టిన కేసులకు భయపడకుండా పోరాటాలు చేసిన తమను పక్కన పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ కోసం పనిచేయని నాయకుల కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ పదవులు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారికి డైరెక్టర్ల పదవులు ఇవ్వడం సరైంది కాదన్నారు. కనీసం మండల నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయన వ్యవహార శైలి కొనసాగితే రాబోయే రోజుల్లో మండల కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకు పోతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల క్షేమ సమాచారాలను కూడా పట్టించుకోని వ్యక్తిని సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జిగా పెట్టడం దారుణమన్నారు. అధిష్టానం ఇప్పటికైనా నియోజకవర్గ ఇంఛార్జి తొలగించి పార్టీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అచ్చిన సత్తయ్య, సంపత్, చెలికాని యాదగిరి, తిరుపతి యాదవ్, విక్రంరెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, కృష్ణ ప్రసాద్, పంగ రాజ శేఖర్ రెడ్డి, శంకరయ్య, సురేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు

- **పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు**

ప్రతిపక్షం,నంగునూరు, మార్చి 30: సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతున్న సమయంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం ఆహ్వానించ దగ్గ పరిణామమని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూజల హరికృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పూజల హరికృష్ణ కృషితో నంగునూరు మార్కెట్ కమిటీలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన నాయకులకు స్థానం కల్పించడం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. హరికృష్ణ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ, సాధారణ కార్యకర్తలకు కూడా న్యాయం చేసే నాయకుడిగా ఎదిగారని కాంగ్రెస్ పేర్కొన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికి మాత్రమే గౌరవం, గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కష్టపడే కార్యకర్తలకు సరైన సమయంలో సరైన అవకాశాలు కల్పించడంలో పూజల హరికృష్ణ ముందుంటారని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగా ఆయన అందరి మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. హరికృష్ణ నాయకత్వంలో సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో, ఏ ఎం సీ వైస్ చేర్మెన్ సాదుల పవన్ కుమార్ , రాజగోపాల్ పేట్ సర్పంచ్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కాటం కనకయ్య, ఎండీ ఇమ్రాన్, రంగు అశోక్ గౌడ్, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్, శ్యామ్ రెడ్డి, రంగారెడ్డి, సురేందర్ రెడ్డి,సంతోష్ రెడ్డి, ప్రభాకర్, మహేశ్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువులను రక్షించుకునేందుకు టీకాలు అవసరం

ప్రతిపక్షం, దౌల్తాబాద్, మార్చి 30: పశువులను వ్యాధుల నుంచి రక్షించేందుకు రైతులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి పరశురాం అన్నారు. సోమవారం సూరంపల్లి గ్రామంలో పశు వైద్యాధికారి పరుశురాం, గ్రామ సర్పంచ్ సప్న స్వామి తో కలిసి పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వార్డుల నుంచి రైతులు తమ పశువులను తీసుకువచ్చి టీకాలు వేయించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాటి సాయిలు, దోమల ప్రమీల,బండి శ్రీలత తిరుపతి, కడారి పోచయ్య, ముత్యాల నరసవ్వ, బొల్లం రాజేష్, కెంసారి మల్లేశం, పశుసంవర్థక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 30: మండలంలోని కొల్గురు గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారికి రాష్ట్ర మాజీ మంత్రి హరీష్‌రావు చొరవతో మంగళవారం నాడు స్థానిక సర్పంచ్ గొడుగు జ్యోతి స్వామి ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన గొడుగు అంజమ్మ, దాకాని స్వామి, ఎరుకలి శ్రీను సీఎంఆర్ఎఫ్ చెక్కును అందుకున్నారు. కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ నిమ్మరాజ్ లక్ష్మి నర్సయ్య, వార్డు సభ్యులు గొడుగు బాల్ రాజు, శెట్టి స్వామి, జీడిపల్లి, నారాయణ రెడ్డి, నిమ్మరాజ్ ముత్తయ్య, నారాయణ,గొల్ల కనకయ్య, రాజయ్య, స్వామి, కారోబార్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచనలో రామంచ విద్యార్థి ప్రతిభ

- **రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి**
- **రూ.2 వేల నగదు పురస్కారం**

ప్రతిపక్షం, చిన్నకోడూరు, మార్చి 30: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తొమ్మిదవ తరగతి చదువుతున్న బ్లెస్సీ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి అందుకుంది. మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు రూ.రెండు వేల నగదు బహుమతి అందుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు కవులు అనే అంశంపై జిల్లా,రాష్ట్ర స్థాయిలలో వ్యాస రచన పోటీలు నిర్వహించింది. జిల్లా స్థాయిలో ప్రైతిభ్ కనబర్చిన బ్లెస్సీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలలో పాల్గొని బ్లెస్సీ తన వ్యాసాన్ని సమర్పించింది. వివిధ జిల్లా నుంచి విద్యార్థులు హాజరై వ్యాసాలను రాశారు. వీటిలో బ్లెస్సీ రాసిన వ్యాసం ప్రథమ బహుమతికి ఎంపికయింది. రాష్ట్రస్థాయి భాషా ఉపాధ్యాయ సంస్థ ఈ నెల 29న హనుమకొండలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. భాషా ఉపాధ్యాయ సంస్థ ప్రతినిధి చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడి చేతుల మీదుగా బ్లెస్సికి రూ.రెండు వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెమెంటోతో అందించి శాలువాతో సత్కరించారు. రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతూ రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని బ్లెస్సీని సోమవారం ప్రధానోపాధ్యాయురాలు సత్తవ్వ, ఉపాధ్యాయులు రామిని భాస్కర్, మల్లయ్య, నరేందర్, భవాని, శ్రీనివాస్, నిర్మల, జమున, సాయి అభినందించారు.

అసైన్డ్ భూములను కాపాడండి!

- **ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు వేసి అమ్మకాలు?**
- **రూ. కోట్ల దోచుకుంటున్న ప్రజాప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 30 : చెరువులను కబ్జా చేస్తూ రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి, ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్న జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములను రక్షించాల్సింది అవసరం ఉందని పెద్దశంకరంపేట మాజీ ఎంపీపీ విగ్రహం శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి లో చెరువుల కబ్జా చేస్తున్నారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు . మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన ఎర్రకుంట చెరువు సర్వే నెంబర్ 258లో 2.7 ఎకరాల భూమిలో మొత్తం 10 భవనాలు నిర్మించారు. ఇందులో విని ప్రైవేట్ సంస్థలు తమ 18 ప్రభుత్వ భూమి 10 ఎకరాలు భూములను కబ్జా చేయడం జరిగిందని ఒకే సర్వర్ నంబర్లో ఉన్న భూములను మరో సర్వే నెంబరు వేసి అమ్మడం జరిగిందని ఇందులో ప్రముఖంగా గ్రామ పంచాయతీ సెక్రెటరీ గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి ప్రభుత్వ భూములను అమ్ముకోవడం జరుగుతుందని వెంటనే అట్టి భూములను పై రీ సర్వే చేసి ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు పశువులు, పక్షులతో కళకళలాడాల్సిన చెరువు భూమిని కబ్జా చేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ముందు తరాలకు చెరువు లేకుండా చేసే ప్రమాదం. ఉన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ఇట్టి విషయమై కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే స్థానిక రెవెన్యూ గ్రామ పంచాయతీ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని. ఇటు అసైన్మెంట్ భూములను ఇటు చెరువు కబ్జాను చేసి అమ్ముకోవడం జరుగుతుందని దేంతో ప్రజాప్రతినిధులు కోట్ల రూపాయలు దండుకోవడం జరుగుతుందని ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూములను చెరువులను కాపాడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్కు ఉందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విగ్రం శ్రీనివాస్ గౌడ్, మాణిక్యం, గండ్ల సాయిలు, కృష్ణ మూర్తి, ప్రవీణ్, నరేష్, నాగరాజు, లోకేష్ గౌడ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కాలువలో ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 30: కుకునూరుపల్లి మండలం, ముద్దాపూర్ గ్రామ శివారులో ఈత సరదా ఘటనలో, హైదరాబాద్ బాలాజీనగర్ కు చెందిన విజయ్ అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం యువకుడు స్నేహితులతో కలిసి విందు అనంతరం మల్లన్నసాగర్ కాలువలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనపూర్ ఆనకట్ట ముంపు భూములకు
నష్టపరిహారం చెల్లించాలి

- **బ్లాక్ లిస్టుల నుండి మా భూములను తీసివేయాలి**
- **ప్రజావాణిలో కలెక్టర్ కు మొరపెట్టుకున్న రైతులు**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 30: మెదక్ జిల్లాలోని మంజీర నదిపై వన దుర్గా ప్రాజెక్ట్ ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంచడం మూలంగా నీటి విలువ సామర్థం పెరిగింది. వివిధ గ్రామాల ప్రజలకు వ్యవసాయ భూములు కోల్పోయారు. అందులో అన్ని గ్రామాల రైతులకు నష్టపరిహారం చెల్లించారు. కేవలం నాగ్సన్పల్లి గ్రామ రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా భూములను బ్లాక్ లిస్టులో పెట్టడం మూలంగా రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని నష్టపోవడం జరిగిందని ఆ గ్రామ రైతులు కలెక్టర్ కు కలిసి ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. ఘనపూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచడం మూలంగా తమ భూములు కోల్పోవడం జరిగిందని నష్టపరిహారం చెల్లిస్తామని ఆ రైతుల సర్వే నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం మూలంగా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమం పథకాలు ఎలాంటి అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని 148 సర్వే నంబర్ నుండి 172 సర్వేనెంబర్ వరకు సుమారు 150 మంది రైతులు తమ వ్యవసాయ భూములు లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నష్టపరిహారం చెల్లించలేదని వారి ఆవేదన వ్యక్తం చేశారు గత పది సంవత్సరాల నుండి అట్టి భూముల సర్వే నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం మూలంగా అనేక విధాలుగా బస్ స్టాప్ పోవడం జరిగిందని వారి ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ లిస్టులో ఉండడం మూలంగా ఇప్పటికే రైతులు సుమారు పదిమంది గుండెపోటుతో మరణించారని మానసిక వేదన గురవుతున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని బ్లాక్ లిస్టుల నుండి సర్వేనెంబర్ లను తొలగించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు మల్లేశం, భూమయ్య, చెల్మెటి కొమురయ్య, వెంకట గాంధీ, కై చంద్రశేఖర్. యాదగిరి శంకరయ్య, నారాయణ, తలారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగూర్ నుంచి ఘనపూర్‌కు
0.3 టీఎంసీ నీరు విడుదల చేయాలి

- **మాజీ డిప్యూటీ స్పీకర్పద్మ దేవేందర్ రెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 30 : సింగూర్ ప్రాజెక్ట్ నుండి ఘనపూర్ రాయకట్టకు 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మదేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాపన్నపేట మండలం చిత్రియాల గ్రామ శివారులో పంటపొలాలను పార్టీ మండల నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకాశం కల్పించారని తెలిపారు. ఘనపూర్ ఆయకట్ట పరిధిలో ఎఫ్ఎం, ఎఫ్ఎన్ కాలువల ద్వారా మూడు మండలాలకు సాగునీరు అందుతూ రైతులు పుష్కలంగా పంటలు పండించుకునేవారని చెప్పారు. పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నదని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఈ సీజన్‌లో సింగూర్ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపురం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు వీరి వెంట చిత్రియల్ సర్పంచ్ సురేష్, పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్, మాజీ రైతుబంధు అధ్యక్షులు సోములు,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు కొత్తపల్లి జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, బద్రి.మల్లేశం శ్రీనాథ్ రావు, నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



నాకు సినిమాలు చూసే అలవాటే లేదు. చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరగడంతో సినిమాల కంటే పుస్తకాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాను. పాత తరం నటుల చిత్రాలు తప్ప ప్రస్తుత ట్రెండ్ సినిమాలపై తనకు పెద్దగా అవగాహన లేదు. చిన్నప్పుడు సినిమా చూసేందుకు ఇంట్లో అనుమతించేవారు కాదు.

- బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్

నక్సలిజం దాదాపు అంతమైంది

- మిగిలిన వారెవరైనా ఉంటే జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 30: ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోం శాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. నక్సలిజం నిర్మూలనపై లోకసభలో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశామన్న అమిత్ షా, తెలంగాణలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చామని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ఎన్‌డీఏ వచ్చాకే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారుఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారన్న అమిత్ షా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరాగాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సైనిక బలగాలు, పోలీసులు, స్టేషన్లపై దాడి చేసి వాళ్లు ఆయుధాలు దోచుకెళ్లారు. నక్సల్స్ వద్ద ఉన్న వాటిలో 52 శాతం ఆయుధాలు పోలీసుల నుంచి దోచుకెళ్లినవేనని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారని, అయితే మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం

నేవీ చీఫ్ మృతిని ధ్రువీకరించిన ఇరాన్

- ఇజ్రాయెల్‌లో 6008 మందికి గాయాలు

అమెరికాఇజ్రాయెల్ దళాలు చేపట్టిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి జరిగిన ఇరాన్ దాడుల్లో సుమారు 6008 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్‌తో పాటు హిజ్‌బుల్లా చేసిన దాడుల వల్ల భారీ మొత్తంలో ఇజ్రాయిలీ ప్రజలు గాయపడినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. గడిచిన 24 గంటల్లో సుమారు 232 మందిని ఆస్పత్రిలో చేర్పించినట్లు ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ పేర్కొన్నది. అయితే గత నాలుగు వారాల్లో మొత్తం 15 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ సమాచారాన్ని ఆ దేశ అంబులెన్స్ సర్వీసు పేర్కొన్నది. మరో వైపు ఇరాన్‌లో భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగింది. ఇజ్రాయెల్అమెరికా బలగాలు నిర్వహిస్తున్న సైనిక ఆపరేషన్ వల్ల .. ఇరాన్‌లో ఇప్పటి వరకు సుమారు 1900 మంది మరణించినట్లు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ పేర్కొన్నది. మరో 20 వేల మంది గాయపడినట్లు ఇరాన్ చెప్పింది.సోషల్ మీడియా మార్కెటింగ్ అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో నేవీ చీఫ్ అలీరెజా తంగ్‌సిరి మృతిచెందినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధ్రువీకరించింది. తమ దేశంలో వీరులు మరణిస్తున్నారని, అయినా కానీ తాము అదే బలంతో ముందుకు వెళ్లనున్నట్లు ఓ ప్రకటనలో ఇరాన్ తెలిపింది. వీరుడైన కమాండర్‌ను కోల్పోయినా.. తమ నావికులు మాత్రం హోర్ముజ్ జలసంధిలో శత్రువులను చీల్చిచెండాడుతున్నారని ఆ ప్రకటనలో వెల్లడించారు. 2018 నుంచి ఇరాన్ నేవీకి తంగసిరి చీఫ్‌గా ఉన్నారు. గత గురువారం జరిగిన దాడిలో అతను ప్రాణాలు కోల్పోయారు.

ఇప్పుడు స్మార్ట్ వర్క్ అనే పదానికి తప్పుడు నిర్వచనాలు ఇస్తున్నారు. పరీక్షల్లో కాపీ కొట్టడం, ఆఫీసులో తోటివారిని తొక్కేసి పైకి వెళ్లడం, సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్తో ప్రచారం చేసుకోవడం ఇవన్నీ తెలివైన పనులని చాలా మంది భ్రమిస్తున్నారు. ఒక విద్యార్థి కాపీ కొట్టి ర్యాంకు సాధించవచ్చు, కానీ ఆ సబ్జెక్టులో అతనికి జ్ఞానం ఎక్కడి నుండి వస్తుంది? రేపు వృత్తి జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు ఆ మార్కుల షీటు అతడిని రక్షించగలదా? లంచం ఇచ్చి కాంట్రాక్టులు పొందే వ్యాపారి, తన పునాదిలోనే పురుగును పెంచుకుంటున్నాడు. ఒక ప్రముఖ సంస్థ అధినేత తన ఆత్మకథలో రాసుకున్నాడు నేను వేగంగా ఎదగడానికి కొన్ని నైతిక విలువలను పక్కన పెట్టాను. లాభాలు వెల్లువెత్తాయి. కానీ కొన్నాళ్లకు నా ఉద్యోగులే నన్ను అనుమానించడం మొదలుపెట్టారు. నా మాటలకు విలువ లేకుండా పోయింది. అప్పుడు అర్థమైంది విలువలు లేని సంపద, ఆత్మ లేని శరీరం వంటిదని. అందుకే పెద్దలు అంటారు, విలువలు లేని విజయం మట్టి లేని మొక్క వంటిదని.

విలువల పునాదిపై విజయ శిఖరం

మన తెలుగు లోగిళ్లలో, అమ్మమ్మలు చెప్పే కథల నుండి తాతయ్యల పురాణ ప్రవచనాల వరకు ఒకే ఒక సూక్తి అంతర్లీనంగా వినిపిస్తూ ఉంటుంది "ధర్మో రక్షతి రక్షితః". ధర్మాన్ని మనం కాపాడితే, ఆ ధర్మమే మనల్ని కవచంలా కాపాడుతుందని దీని అర్థం. అయితే, నేటి కృత్రిమ మేధస్సు, రాకెట్ వేగంతో దూసుకుపోతున్న పోటీ ప్రపంచంలో ఈ మాట కేవలం గోడల మీద సూక్తిలాగే మిగిలిపోతోందా? విలువలు పట్టుకుని వేలాడితే వెనకబడిపోతామా? అన్న సందేహం నేటి యువతను నిలువునా తొలిచేస్తోంది. నిజానికి, విజయం అంటే ఏమిటి? కేవలం బ్యాంకు బ్యాలెన్స్ పెరగడమా? విలాసవంతమైన కార్లలో తిరగడమా? లేక సమాజంలో ఒక హోదాను అనుభవించడమా? ఇవన్నీ బాహ్య ఆడంబరాలు మాత్రమే. ఒక మనిషి తన అంతరాత్మకు జవాబు చెప్పుకోగలిగినప్పుడు, తన వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టకుండా శిఖరాగ్రానికి చేరినప్పుడు కలిగే ఆ తృప్తి ఉందే అది కోట్లాది రూపాయలు ఇచ్చినా దొరకదు. విలువలు వదిలి సాధించిన విజయం, నీరు లేని ఎడారిలో ఎండమావి వంటిది. చూడ్డానికి ఆశగా ఉంటుంది కానీ, దాహాన్ని తీర్చలేదు. నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఒక అపోహ బలంగా నాటుకుపోయింది. నిజాయితీగా ఉంటే వ్యాపారం సాగదు అనేవి నిత్యం వినే మాటలు. కానీ లోతుగా ఆలోచిస్తే, విలువల బాటలో నడవడం అనేది బలహీనత కాదు, అది అత్యున్నతమైన సాహసం. ప్రవాహానికి ఎదురీదడం ఎంత కష్టమో, అవినీతిమయమైన లోకంలో నీతిగా నిలబడటం అంతకంటే పెద్ద యుద్ధం. అందరూ అబద్ధాలు ఆడుతున్నప్పుడు నిజం చెప్పడానికి గట్స్ కావాలి. ఆ గట్సే ఒక మనిషిని సాధారణ వ్యక్తి నుండి అసాధారణ నాయకుడిగా మారుస్తాయి. చరిత్ర పుటలను ఒక్కసారి తిరగేయండి. మహాత్మా గాంధీ సత్యశోధనలో ఎన్ని అవమానాలు పడ్డారు? డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తన ఆశయాల కోసం ఎన్ని అగ్నిపరీక్షలు ఎదుర్కొన్నారు? స్వామి వివేకానంద భారతీయతను ప్రపంచానికి చాటడంలో ఎన్ని సవాళ్లను జయించారు? వీరంతా ఏ రోజూ తమ విలువల విషయంలో రాజీ పడలేదు. తాత్కాలిక లాభాల కోసం తమ సిద్ధాంతాలను అమ్ముకోలేదు. అందుకే శతాబ్దాలు గడిచినా వారి కీర్తి వెలుగుతూనే ఉంది. వారి విజయం విలువల పునాదుల మీద నిర్మితమైంది కాబట్టే, కాలపరీక్షకు తట్టుకుని నిలబడింది. నేడు స్మార్ట్ వర్క్ అనే పదానికి తప్పుడు నిర్వచనాలు ఇస్తున్నారు. పరీక్షల్లో కాపీ కొట్టడం, ఆఫీసులో తోటివారిని తొక్కేసి పైకి వెళ్లడం, సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్తో ప్రచారం చేసుకో

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

వడం ఇవన్నీ తెలివైన పనులని చాలా మంది భ్రమిస్తున్నారు. ఒక విద్యార్థి కాపీ కొట్టి ర్యాంకు సాధించవచ్చు, కానీ ఆ సబ్జెక్టులో అతనికి జ్ఞానం ఎక్కడి నుండి వస్తుంది? రేపు వృత్తి జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు ఆ మార్కుల షీటు అతడిని రక్షించగలదా? లంచం ఇచ్చి కాంట్రాక్టులు పొందే వ్యాపారి, తన పునాదిలోనే పురుగును పెంచుకుంటున్నాడు. ఒక ప్రముఖ సంస్థ అధినేత తన ఆత్మకథలో రాసుకున్నాడు నేను వేగంగా ఎదగడానికి కొన్ని నైతిక విలువలను పక్కన పెట్టాను. లాభాలు వెల్లువెత్తాయి. కానీ కొన్నాళ్లకు నా ఉద్యోగులే నన్ను అనుమానించడం మొదలు పెట్టారు. నా మాటలకు విలువ లేకుండా పోయింది. అప్పుడు అర్థమైంది విలువలు లేని సంపద, ఆత్మ లేని శరీరం వంటిదని. అందుకే పెద్దలు అంటారు, విలువలు లేని విజయం మట్టి లేని మొక్క వంటిదని. అది మొలకెత్తవచ్చు కానీ, కాలక్రమేణా ఎండిపోవడం ఖాయం.విలువలు మరియు విజయం అనేవి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. దీనికి అతిపెద్ద ఉదాహరణ 'టాటా గ్రూప్'. భారతదేశంలో టాటా అంటే కేవలం ఒక కంపెనీ కాదు, అదొక నమ్మకం. టాటా సంస్థల వ్యవస్థాపకుల నుండి నేటి రతన్ టాటా వరకు, వారు పాటించిన పారదర్శకత, సామాజిక బాధ్యత వారిని ప్రపంచస్థాయిలో నిలబెట్టాయి. లాభం కంటే విలువకే వారు ప్రాధాన్యతనిచ్చారు. ఫలితంగా, ప్రజల గుండెల్లో వారు సంపాదించుకున్న స్థానం వెలకట్టలేనిది. ఒక సంస్థ లేదా వ్యక్తి

> **విజయం అంటే కేవలం గమ్యాన్ని చేరడం కాదు, ఆ గమ్యాన్ని ఏ దారిలో చేరామనేది ముఖ్యం. జీవిత చరమాంకంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, మనం సంపాదించిన బంగారు ఆభరణాలు మనకు గుర్తుకురావు. మనం ఎంతమందికి నిస్వార్థంగా సహాయం చేశాం, ఎంతమంది కన్నీళ్లు తుడిచాం, క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిజాయితీగా ఎలా నిలబడ్డాం అనే జ్ఞాపకాలే మనకు అత్యున్నతమైన శాంతిని ఇస్తాయి.**

మీద ఏర్పడే నమ్మకం అనేది ఏ మార్కెట్లోనూ దొరకని అతిపెద్ద పెట్టుబడి. కేవలం కార్పొరేట్ దిగ్గజాలే కాదు, మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా ఇలాంటి అప్రకటిత విజేతలు ఎందరో ఉన్నారు. ఏ ఆశ లేకుండా పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు, కల్తీ లేని పంటను పండించే రైతు, నిజాయితీగా పనిచేసే చిరు వ్యాపారి వీరి జీవితాలు పత్రికల్లో హెడ్ లైన్స్ కాకపోవచ్చు. కానీ వారు పొందే మానసిక ప్రశాంతత, వారి పట్ల సమాజానికి ఉన్న గౌరవం అసలైన విజయ చిహ్నాలు. నేటి తరం ఎంతో మేధస్సు కలది. టెక్నాలజీ మీ వేళ్ల మీద ఆడుతోంది. కానీ గుర్తుంచుకోండి, కెరీర్ లో ఎదగడానికి షార్ట్ కట్స్ వెతకకండి. అవకాశం వచ్చినప్పుడు కాదు, అవకాశం రానిప్పుడు మీరు ఎలా ప్రవర్తిస్తారనేదే మీ అసలైన వ్యక్తిత్వం. కష్టకాలంలో కూడా నీతిని వదలని వాడే రేపటి చరిత్రను నిర్మిస్తాడు. ఇన్‌స్టాగ్రామ్ లో లైకులు, యూట్యూబ్ లో వ్యూస్ రాత్రికి రాత్రే మిమ్మల్ని సెలబ్రిటీని చేయవచ్చు. కానీ ఆ వెలుగులు దీపావళి టపాసులు వంటివి. పేలుడు ఉన్నంత సేపే సందడి. కానీ విలువల వెలుగు ధృవతార వంటిది, అది నిరంతరం దారి చూపిస్తుంది. విలువలను వదిలేసినప్పుడు మనం కేవలం ఒక సూత్రాన్ని మాత్రమే కోల్పోము. మనలోని ఆత్మవిశ్వాసాన్ని, ప్రశాంతతను, అన్నింటికంటే ముఖ్యంగా మన సొంత గుర్తింపును కోల్పోతాము. ఒకసారి అబద్ధానికి అలవాటు పడితే, రెండోసారి రాజీ పడటం చాలా సులభం అవుతుంది. అలా మెల్లమెల్లగా మనలోని మంచి మనిషి చచ్చిపోతాడు. మన పిల్లలకు మనం ఏ వారసత్వాన్ని ఇస్తున్నాం? కోట్లాది రూపాయల ఆస్తినా? లేక తలెత్తుకుని బతికే వ్యక్తిత్వాన్నా? అనేది మనమే నిర్ణయించుకోవాలి. ఒక పాత సామెత ఉంది చేతి నిండా చేపలు ఉన్నా, నీళ్లు కొట్టుకుపోతే అన్నీ పోతాయి.అలాగే, పునాది లేని సంపద, విలువలు లేని కీర్తి ఏ చిన్న తుఫాను వచ్చినా కుప్పకూలిపోతాయి. విజయం అంటే కేవలం గమ్యాన్ని చేరడం కాదు, ఆ గమ్యాన్ని ఏ దారిలో చేరామనేది ముఖ్యం. జీవిత చరమాంకంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, మనం సంపాదించిన బంగారు ఆభరణాలు మనకు గుర్తుకురావు. మనం ఎంతమందికి నిస్వార్థంగా సహాయం చేశాం, ఎంతమంది కన్నీళ్లు తుడిచాం, క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిజాయితీగా ఎలా నిలబడ్డాం అనే జ్ఞాపకాలే మనకు అత్యున్నతమైన శాంతిని ఇస్తాయి. కాబట్టి మిత్రులారా, విజయం కోసం విలువలను బలి ఇవ్వకండి. విలువలతో కూడిన విజయమే చిరస్థాయిగా నిలుస్తుంది. అది కొంచెం ఆలస్యంగా రావచ్చు, కానీ వచ్చినప్పుడు అది మీ వంశానికే వన్నె తెస్తుంది. మన తెలుగు సంస్కృతి నేర్పిన ఈ అమూల్యమైన పాఠాన్ని గుండెల్లో దాచుకుందాం. ధర్మబద్ధమైన గెలుపు కోసం అడుగులు వేద్దాం.

అదే అసలైన జయం!

శాసన మండలికి నితీశ్ రాజీనామా

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 30: బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు. సీఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. మార్చి 16న బీహార్ స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే రెండు సభల్లో సభ్యత్వం కలిగి ఉన్నప్పుడు, ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయడానికి 14 రోజుల గడువును రాజ్యాంగం నిర్దేశించింది.

హిందూ మతాన్ని, ఆలయాలను మోడీ పట్టించుకోరు

- బీజేపీ , ఎల్డీఎఫ్ కలిసుండడంతోనే మౌనం
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదు: తీవ్ర విమర్శలు చేసిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 30: కేరళలో ఏప్రిల్ 9వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం పాతానమిట్టలో జరిగిన సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. కేరళ పర్యటన వేళ శబరిమల అంశంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. దీని అర్థం బీజేపీఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో ప్రసంగిస్తూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐఎం, బీజేపీ పార్టీలను సంయుక్తంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. తమ పార్టీ ఎల్డీఎఫ్‌తో పోటీపడుతోందని, కానీ ఆ పార్టీకి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. బీజేపీతో ఎవరు పోరాడినా, వారిపై బీజేపీ అటాక్ చేస్తుందని, తనపై అటాక్ జరిగిందని, నాపై 36 కేసులు ఉన్నాయని, 55 గంటల పాటు నిర్విరామంగా తనను ప్రశ్నించారన్నారు. అయితే కేరళ సీఎం పినరయి విజయన్‌పై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎల్డీఎఫ్ నాయకత్వం చాలా భ్రష్టుపట్టిందని, ఆ పార్టీ నేతలపై కేసులు ఉన్నాయని, కానీ బీజేపీ నుంచి వారిపై వత్తిడి లేదని, దర్యాప్తులు జరగడం లేదని, వాళ్లకు బెదిరింపులు కూడా లేవని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీ ఎక్కడకు వెళ్లినా.. ఆలయాల గురించి మతం గురించి మాట్లాడుతారని, కానీ పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల అంశాన్ని లేవనెత్తలేదన్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నేతలు బంగారాన్ని దోచుకెళ్లిన విషయాన్ని ప్రధాని మరిచిపోయారని రాహుల్ అన్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లిన లెఫ్ట్ ఫ్రంట్ నేతలు.. దాన్ని ఇత్తడితో నింపేశారని ఆరోపించారు. శబరిమల అంశంపై ప్రధాని మౌనంగా ఉండి బీజేపీకి నష్టం జరగకుండా చూసే ప్రయత్నం చేశారన్నారు. దీని వల్ల బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు స్పష్టమైందని, ఇక ప్రధాని మోదీ మతాన్ని పట్టించుకోరని, హిందూ మతాన్ని కానీ ఆలయాలను కానీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓట్లు వస్తాయంటే, అప్పుడు ఆయన ఆలయాల గురించి మాట్లాడుతారని, ఎల్డీఎఫ్ ప్రయోజనాలను రక్షించాలంటే , ఆయన ఆలయాల గురించి మాట్లాడరని రాహుల్ అన్నారు. ఒకవేళ యూడీఎఫ్ అధికారంలోకి వస్తే, అప్పుడు ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌డీఎప్ ఓ లెఫ్ట్ పార్టీ తరహాలో వ్యవహరించడం లేదన్నారు. ఆ పార్టీ చర్యలు, విధానాలు అన్నీ.. బీజేపీకి కార్పొరేట్ తొత్తులా ఉన్నాయని, కార్పొరేట్ సపోర్టుతో ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లుగా ఉందని రాహుల్ అన్నారు.

సినిమా

హిట్ అయితేనే..

కృతి శెట్టి టాలీవుడ్ ..కోలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం, ట్యాలెంట్ ఉన్నా?టాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో కోలీవుడ్ లో కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. కాకపోతే? తెలుగు కంటే తమిళ్ లో మెరుగ్గా కనిపిస్తోంది. సినిమా ఫ్లాప్ అయినా మరో ఛాన్స్ అందుకోగల్గుతుంది. అక్కడైనా ఇలా ఎంత కాలం? దీంతో అమ్మడి కెరీర్ హిట్ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కృతి శెట్టి ఆశలన్నీ తాజా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పైనే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి అంచనాలు ఉన్నాయి. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ ఏర్పడింది. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా గెస్ట్ రోల్ పోషించడం సినిమాకు కీలకంగా మారింది. ప్రత్యేకించి కృతి శెట్టికి తమిళంలో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని ఎంతో ధీమాతో ఉంది. ఈ విషయంలో మేకర్స్ కూడా అంతే కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సూపర్ హిట్ అయితే కృతి గ్రాఫ్ మళ్లీ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. సినిమా గనుక ఆశించిన స్థాయిలో ఆడకపోతే? కృతి శెట్టి కెరీర్ మరిన్ని ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది.

సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లితో

దిల్ రాజు మూవీ

సినీ ఇండస్ట్రీలో ఒక్కసారిగా సంచలనం రేపిన ఈ భారీ అనౌన్స్మెంట్ ను సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి, దిల్ రాజు సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం వచ్చే నెలలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ వంశీ పైడిపల్లి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ నిర్మాత దిల్ రాజు కలసి హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. ఈ హై పవర్డ్ కొలాబరేషన్ అనౌన్స్‌మెంట్ అభిమానులు, పరిశ్రమలో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ త్రయం ఈ ప్రాజెక్ట్‌ను సోషల్ మీడియాలో అనౌన్స్ చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ 2027లో బిగ్గెస్ట్ సినిమా ఈవెంట్ లలో ఒకటిగా నిలుస్తోంది, ఈ చిత్రం ఏప్రిల్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. బిగ్ స్కేల్ ఎంటర్‌టైనర్స్‌ను ఎమోషన్స్ తో మేళవిస్తూ చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు వంశీ పైడిపల్లి. ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, విజయ్ వంటి అగ్ర హీరోలతో పని చేసి, విభిన్న జానర్స్ లో తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'మహర్షి' జాతీయ అవార్డు సాధించడం ఆయన విజన్ కి నిదర్శనం. దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారు. 60కి పైగా చిత్రాలను నిర్మించిన ఆయన, కంటెంట్, కమర్షియల్ విజయాలతో సక్సెస్ ఫుల్ గా నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. 'మహర్షి', 'శతమానం భవతి' చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకోవడం ఆయన క్యాలిటీకి నిదర్శనం. ఈ ప్రాజెక్ట్ ద్వారా సల్మాన్ ఖాన్ తొలిసారి వంశీ పైడిపల్లి - దిల్ రాజుతో కలిసి పని చేయబోతున్నారు. మూడు దశాబ్దాల కెరీర్‌లో సల్మాన్ ఖాన్ దబాంగ్, బాడీగార్డ్, రెడీ టు కిక్, బజరంగీ భాయిజాన్, సుల్తాన్, ఐకానిక్ టైగర్ ఫ్రాంచైజీ వంటి అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలతో భారీ విజయాలు సాధించారు. వంశీ పైడిపల్లి - దిల్ రాజు కాంబినేషన్ ఇప్పటికే ఐదు విజయవంతమైన చిత్రాలను అందించింది. ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు సల్మాన్ ఖాన్ మ్యాసీవ్ స్క్రీన్ ప్రెజెన్స్, వంశీ పైడిపల్లి స్పెషల్ స్టోరీ టెల్లింగ్, దిల్ రాజు గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ కలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించనుంది. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే తెలియజేయనున్నారు.

పెద్ద బ్యానర్‌లో కొత్త మూవీ

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్ లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

వైభవ్ సిక్సర్ల మోత

భారీ విజయంతో రాజస్థాన్ బోణీ..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. ఆల్‌రౌండ్ షోతో చెన్నై సూపర్ కింగ్స్ ను వణికించిన రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 128 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ(52), యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వైభవ్ అయితే.. ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను హడలెత్తించాడు. 15 బంతుల్లోనే రికార్డు హాఫ్ సెంచరీతో ఈ చిచ్చరపిడుగు లక్ష్యాన్ని కరిగించగా.. యశస్వీ క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. బ్యాటింగ్, బౌలింగ్.. రెండు విభాగాల్లో దారుణంగా విఫలమైన సీఎస్కే ఘోర పరాభవం మూటగట్టుకుంది. పంతొమ్మిదో సీజన్‌లో వరసగా రెండు భారీ స్కోర్ల మ్యాచ్‌ల తర్వాత లో స్కోరింగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజా విసిరింది. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ముచ్చెమటలు పట్టిస్తూ భారీ విజయంతో బోణీ కొట్టింది. తొలుత సీఎస్కేను 127కే ఆలౌట్ చేసిన రాజస్థాన్.. వైభవ్ సూర్యవంశీ(52 : 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

పవర్ ప్లేలోనే యాభై

తొలుత బౌలర్లు చెన్నైను 127 కట్టడి చేయగా ఓపెనర్లు ధాటిగా ఇన్నింగ్స్ మొదలెట్టారు. మ్యాట్ హెన్రికి చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(52) 4, 6 బాదగా యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) చివరి బంతిని బౌండరీ దాటించాడు. అన్షుల్ కంబోజ్ వేసిన ఐదో ఓవర్లో రెచ్చిపోయిన వైభవ్.. రెండు ఫోర్లు, సిక్సర్‌తో 15 పరుగులు పిండుకున్నాడు. పవర్ ప్లేలో వరుసగా రెండు సిక్సర్లతో 15 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడీ హిట్టర్. అతడి విధ్వంసంతో పవర్ ప్లేలో 74 రన్స్ చేసింది రాజస్థాన్. ఆ తర్వాతి ఓవర్లోనే సర్ఫరాజ్ డైవింగ్ క్యాచ్‌తో సూర్యవంశీ ఔటయ్యాడు. ధ్రువ్ జురెల్(18) వస్తూనే బౌండరీలతో సీఎస్కే బౌలర్లను హడలెత్తించాడు. కంబోజ్ ఓవర్లో స్కూప్ షాట్ ఆడాలనుకున్న జురెల్ దురదృష్టవశాత్తూ బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. అప్పటికే రాజస్థాన్ విజయం వాకిట నిలవగా యశస్వీతో కలిసి కెప్టెన్ రియాన్ పరాగ్(14 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. నూర్ అహ్మద్ ఓవర్లో బ్యాక్‌వర్డ్ పాయింట్లో పరాగ్ సిక్సర్, హెన్రీ వేసిన 12వ ఓవర్ తొలి బంతిని యశస్వీ స్టాండ్స్‌లోకి పంపడంతో 8 వికెట్ల తేడాతో రాజస్థాన్ బోణీ కొట్టింది.

శాంసన్ 'ఆరు'కే ఔట్

గువాహటిలో రాజస్థాన్ రాయల్స్ పేసర్ల విజృంభణతో టాపార్డర్ చేతులెత్తేయగా చెన్నై స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన సీఎస్కేకు శుభారంభం లభించలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ శాంసన్(6)ను నంద్రె బర్గర్(226) బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ తర్వాతి ఓవర్లో గైక్వాడ్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ఆయుష్ మాత్రే(0)ను బర్గర్ పెవిలియన్ చేర్చాడు. బర్గర్, ఆర్చర్ విజృంభణతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఇంప్యాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్(17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, జడేజా అతడిని ఎల్బీగా ఔట్ చేయగా.. చెన్నై 51కే ఐదు వికెట్లు కోల్పోయింది. ఆవెంటనే సిక్సర్ బాదిన శివం దూబే(6)ను సైతం జడ్డూ ఔట్ చేసి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కార్తిక్ శర్మ(18), జేమీ ఓవర్టన్(43)లు గొప్పగా ఆడారు. సందీప్ శర్మ ఓవర్లో బౌండరీతో సీఎస్కే స్కోర్ వంద దాటించాడు ఓవర్టన్. అన్షుల్ కంబోజ్ (7 నాటౌట్) రెండు ఫోర్లు బాదగా.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓవర్టన్ సిక్స్ బాదగా చెన్నై 127 పరుగులకే ఆలౌటైంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200